# మహానది

MAHANADI TELUGU DAILY

Website: www.mahanadi.net

RNI No. TELTEL . 2012/48343

రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 315 | ఎడిటర్ : మామిడి సోమయ్య | మంగళవారం | ఫిబ్రవరి | 4 | 2025 పేజీలు : 8 | వెల : రూ.2.00


## డాలర్ కాదంటే... వంద శాతం ట్యాక్స్


న్యూఢిల్లీ, ఫిబ్రవరి3,: అమెరికా ఫస్ట్ అంటూ దూకుడు కంటిన్యూ చేస్తున్నారు యూఎస్ ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్. అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపిన ట్రంప్.. ఇప్పుడు ఉరిమి.. ఉరిమి బ్రిక్ దేశాలపై గురిపెట్టారు. రావొచ్చు.. పోవచ్చు.. వ్యాపారం చేసుకోవచ్చు. కానీ మారకం మాత్రం డాలర్లలో ఉండాలి. మీ దేశం.. మీ కరెన్సీ.. అమెరికాలో ఎగుమతులు, దిగుమతులకు సంబంధించి లావాదేవీలు మాత్రం పక్కాగా డాలర్లలోనే జరగాలని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. కాదు.. కూడదంటే వంద శాతం సుంకం తప్పదంటూ బ్రిక్స్ దేశాలకు వార్నింగ్ బెల్ ఇచ్చారు.బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, సౌతాఫ్రికా.. బ్రిక్స్ కూటమి ఏర్పడి 16 ఏళ్లు. ఆ తరువాత ఇండినేషియా, ఇరాన్, ఇథోపియా, అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలు బ్రిక్స్‌లో చేరాయి. 2023లో జరిగిన బ్రిక్స్ సమావేశంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డాలర్ డామినేషన్‌కు కళ్లెం వేసేలా ఓ కీలక ప్రతిపాదన చేశారు. అప్పటి సూచనపై ఇప్పుడు ట్రిగ్గర్ ఎక్కు పెట్టారు అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్. అమెరికాతో వాణిజ్య బంధాన్ని కొనసాగించాలంటే, ట్రేడింగ్ డాలర్లలోనే జరగాలని మెలిక పెట్టనే పెట్టేశారు ట్రంప్.

## ఈవీఎంలతో జిమ్మిక్కులకు బీజేపీ కుట్ర..

- కేజ్రీవాల్



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 03:** బీజేపీపై ఆప్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. ఈవీఎం యంత్రాల ద్వారా 10శాతం ఓట్లలో వ్యత్యా సాలు కలిగిస్తారని నివేదికల ద్వారా స మాచారం అందిందని కేజ్రీవాల్ ఆరోపించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కొద్ది నిమిషాల్లో ముగియనుంది. ఈ సందర్భంగా ఢిల్లీ ఓటర్లను ఉద్దేశించి కేజ్రీవాల్ సందేశం విడుదల చేశారు.ప్రతి ఓటు ఆప్‌కి వెళ్లేలా పెద్ద సంఖ్యలో ఓట్లు వేయాలని కోరారు. ప్రతి చోట 10శాతం ఆధిక్యం వచ్చేలా ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈవీఎంలను ఎదుర్కోవడానికి ఏకైక మార్గం పెద్ద సంఖ్యలో ఓట్లు వేయడమే నన్నారు. మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల ద్వారా ఒక గుణపాఠం నేర్చుకున్నామన్నారు. ముందు జాగ్రత్త చర్యగా ఒక వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. యంత్రాలు ట్యాంపర్ చేయలేని విధంగా ప్రతి పోలింగ్ బూత్ వివరాలను అప్‌లోడ్ చేస్తామన్నారు.



## కుంభమేళా తొక్కిసలాట ఘటనపై చర్చించాలి

పార్లమెంటులో విపక్షాల ఆందోళన

తిరస్కరించిన స్పీకర్, డిప్యూటి చైర్మన్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి3 : కుంభమేళాలో మౌని అమావాస్య రోజున జరిగిన తొక్కిసలాటలో 30 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనను పార్లమెంట్ చర్చించాలంటూ లో విపక్షాలు లేవనెత్తాయి. సోమవారం ఉభయ సభలు ప్రారంభం అయిన వెంటనే పెద్దఎత్తున నిరసనలు చేపట్టడంతో గందరగోళ వాతావరణం ఏర్పడింది. ప్రతిపక్ష సభ్యుల ప్రవర్తనను లోక్‌సభ స్పీకర్ తీవ్రంగా ఖండించారు. పన్ను చెల్లింపుదారుల డబ్బును వృథా చేయొద్దని, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రశ్నోత్తరాల సమయం తర్వాత ఆ ఘటన గురించి ప్రస్తావించాలని స్పీకర్ ఆదేశిం చినప్పటికీ.. నినాదాలు ఆగలేదు. ఈ పరిస్థితుల మధ్యే లోక్‌సభ కార్యకలాపాలు కొనసాగాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. మహాకుంభమేళా తొక్కిసలాట ఘటనపై చర్చ చేపట్టాలంటూ ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. కుంభమేళా ఘటనపై సమాధానమివ్వాలి అని నినాదాలు చేస్తూ ప్రతిపక్షాలు వెల్‌లోకి దూసుకెళ్లాయి. మృతుల జాబితాను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగిన కొన్ని గంటల తర్వాత మృతుల సంఖ్యను వెల్లడించేందుకు యోగి ప్రభుత్వం నిరాకరించిందని, వాస్తవ సంఖ్యను దాచిపెడుతోందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు



మీడియా మిత్రుల సమావేశంలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్,ఫిబ్రవరి03,: అర్హులైన ప్రతీ జర్నలిస్టుకి ఇందిరమ్మ ప్రభుత్వం లో ఇళ్ల స్థలం మంజూరు చేయించడం జరుగుతుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కూసు మంచి లోని విజయ రామ ఫంక్షన్ హాల్లో సోమవారం జరిగిన పాలేరు నియోజకవర్గం మీడియా మిత్రుల సమావేశం లో మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇండ్ల సమస్యలను తమ ప్రభుత్వంలో పరిష్కరిస్తామనిహామీ ఇచ్చారు. ప్రస్తుతం జర్నలిస్టు ఇండ్ల సొసైటీ సమస్య సుప్రీం కోర్టు పరిధిలో ఉందని పేర్కొన్నారు.న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే ప్రక్రియ గురించి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. అతిత్వరలోనే వారి సమస్యకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అక్రిడేషన్, హెల్త్ కార్డుల మంజూరు జాప్యం, అమలులో తలెత్తుతున్న లోపాలను సవరిస్తామని తెలిపారు. అలాగేమీడియామిత్రుల విజ్ఞప్తి మేరకు కూసు మంచిలో మీడియా హౌజ్‌కానీప్రెస్ క్లబ్ కానీ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.

## ట్రంప్ ఎఫెక్ట్..

ఆల్ టైమ్ కనిష్టానికి రూపాయి విలువ..!



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 03:**రూపాయి విలువ భారీగా క్షీణి స్తోంది.డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ ఆందోళన కలిగిస్తోంది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత రోజు రోజుకూ పతనం అవుతూవస్తున్న రూపాయి మారకం విలువరికార్డు స్థాయిలో కనిష్టానికిపరుగులు తీస్తోంది. ఆల్ టైమ్ కనిష్టానికి పడిపోయింది. చరిత్రలో తొలిసారిగా డాలర్‌తో పోలిస్తే రూ. 87 దాటి పడిపోయింది. కెనడా,మెక్సి కో,చైనాలపై అమెరికా ప్రెసిడెం ట్‌టారిఫ్‌లు విధించడంతో ఆర్థిక వ్యవస్థలో విస్తృత వాణిజ్య యుద్ధ భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ప్రారంభ ట్రేడింగ్‌లో రూపాయి విలువ 67పైసలు క్షీణించి యూఎస్ డాలర్‌తో పోలిస్తే 87.29 వద్ద రికార్డు స్థాయిలో క్షీణతకు గురైంది.

## పిల్లల భవిష్యత్తును ఆప్ నాశనం చేస్తోంది: ప్రధాని

### చెట్టు కింద విద్యార్థులతో మోదీ ముచ్చట్లు..



ఢిల్లీ విద్యార్థులతో మోదీ ముఖాముఖీ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 03:**న్యూఢిల్లీ: విద్యార్థుల భవిష్యత్తు కంటే సొంత ప్రతిష్టను పెంచుకునేందుకే ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభుత్వంప్రయత్నిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును ఆప్ నాశనం చేస్తోందని అన్నారు. ఢిల్లీవిద్యార్థులతో మోదీ సోమవారంనాడు ముఖాముఖీ సంభాషించారు. ఆప్ విద్యావిధానంపై విమర్శలు గుప్పించారు. "తొమ్మిదవతరగతి దాటి చదివేందుకు ఢిల్లీ పాఠశాలల్లో విద్యార్థులను ఆప్‌ప్రభుత్వం అనుమతించడం లేదని విన్నాను. పాస్ గ్యారెంటీ అనుకున్నవాళ్లనే పైతరగతు లకు పంపిస్తున్నారని తెలిసింది. సరైనరిజల్ట్స్ రాకపోతే ప్రభుత్వం పరువు పోతుందని వారు భావిస్తున్నారు. ఇది విద్యావ్యవస్థలో నిజాయితీ లోపించడమే అవుతుంది"అని విద్యార్థులతో ప్రధానిఅన్నారు. 9,11 తరగతుల్లో ఫెయిల వుతున్న విద్యార్థుల సంఖ్య అధికంగా ఉందంటూ గతంలో పలు కథనాలు వచ్చిన నేపథ్యంలో ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ముగియనుండటంతో ప్రధానమంత్రి గత కొద్దిరో జులుగా వరుస ర్యాలీల్లో పాల్గొంటూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారంటూ ప్రచారంసాగించారు. ఆదివారంనాడు ఆర్కే పురం ర్యాలీలో వసంత పంచమి రాకతో వాతావరణంలో కొత్త ఉత్సాహం కనిపిస్తోందని, ఢిల్లీలో మరికొద్ది రోజుల్లో అభివృద్ధి గాలులు వీచనున్నాయని అన్నారు. ఈసారి ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం రాబోతోందన్నారు.



## మహా కుంభ్ తొక్కిసలాట దురదృష్టకరం

- సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 03:** ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జనవరి 13నుంచి మహా కుంభమేళ ప్రారంభం అయింది. అయితే జనవరి 29న మౌన అమావాస్య సందర్భంగా కోట్లాది మంది ప్రజలు తరలిరావడంతో సెక్టార్-2లో తొక్కిసలాట జరిగి దాదాపు 30 మంది మృతి చెందినట్లు అధికా రులు గుర్తించారు. అయితే ఈ తొక్కిసలాట భద్రతా లోపం వల్లనే జరిగిందని.. దీనిపై విచారణ జరపాలని సుప్రీంకోర్టు లో పిటిషన్ వేశారు. కాగా తొక్కిసలాటపై దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు స్వీకరిం చడానికి నిరాకరించింది. అలాగే.. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభ్‌లో జరిగిన తొక్కిసలాట "దురదృష్టకర సంఘటన" అనిసుప్రీంకోర్టు పేర్కొంది. అలాగే పిఐఎల్ దాఖలు చేసిన న్యాయవాదిని తన పిటిషన్‌తో అలహాబాద్ హైకోర్టుకు తరలించాలని సుప్రీంకోర్టు కోరింది.




## పంచాయితీ ఎన్నికలపై కమలం ఫోకస్

హైదరాబాద్,ఫిబ్రవరి,3,: తెలంగాణలో త్వరలోనే గ్రామ పంచా యతీ ఎన్నికలు జరగనున్న వేళ.. కమలం పార్టీ కీలక చర్యలు తీసు కుంటుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కొత్త అధ్యక్షులను ఎంపిక చేసే పనిలో పడింది. ఈ క్రమంలోనే ఇప్పటికే వార్డు, గ్రామ, మండల, డివిజన్ అధ్యక్షుల నియమాకాన్ని పూర్తి చేసింది. అనం తరం జిల్లా అధ్యక్షుల నియామ కంపై దృష్టి పెట్టింది. ఈ నేపథ్యం లోనే సోమవారం కొత్త జిల్లా అధ్యక్షులను కమలం పార్టీ హైక మాండ్ ప్రకటించనుంది. ఈ మేరకు బీజేపీ తెలంగాణ ఇంఛా ర్జ్ సునీల్ బన్సల్, ఎన్నికల పరిశీ లకులు అరవింద మీనన్, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డిలు కేంద్ర నాయకత్వంతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు బీజేపీ హైకమాండ్ ఓకే చెప్పడంతో జిల్లా అధ్యక్షుల ఎంపికకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది.ఈ నేపథ్యంలోనే జిల్లా అధ్యక్షులుగా పోటీ పడేవారు.. చి నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించింది. అయితే రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 11 జిల్లాల అధ్యక్షుల ప్రకటనను హైకమాండ్ పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తుంది. మిగిలిన 22 జిల్లాలకు ఆశావాహుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు.

## మేకిన్ ఇండియా మంచి ఆలోచనే...

- అమలులో మోడీ సర్కార్ విఫలం
- బడ్జెట్ అన్ని వర్గాలను నిరుత్సాహానికి గురిచేసింది
- బడ్జెట్‌పై లోక్‌సభలో రాహుల్ హాట్ కామెంట్స్
- యూపీఏ, ఎన్డీఏ పాలనపై రాహుల్‌గాంధీ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 03:** యూపీఏ,ఎన్డీఏ పాలనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత,కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరిం చడంలో యూపీఏ, ఎన్డీఏ ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వం ఉపాధి సమస్యను పరిష్కరించలేక పోయిందని ధ్వజమెత్తారు. ఇక యూపీఏ, మోడీ ప్రభుత్వం రెండూ కూడా నిరుద్యోగుల సమస్యను మాత్రం పరిష్కరించలేకపోయాయని రాహుల్ ఒప్పుకున్నారు. ఉత్పత్తి ఆధారిత దేశంగా మనంవిఫలమై.. దానిని చైనాకు అప్పగించామన్నారు. ఇకనైనా మనం ఉత్పత్తి పైనే పూర్తిగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. మేకిన్ ఇండియా మంచి ఆలోచనే అయినప్పటికీ దానిని అమలుచేయడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. "లోక్‌సభ ఫలితాల తర్వాత ప్రధాని మోడీ రాజ్యాంగం ముందు తల వంచవలసి రావడం చూసి నేను సంతోషించాను. లోక్‌సభ మరియు అసెంబ్లీ ఎన్నికల మధ్య మహారాష్ట్ర ఓటర్ల జాబి తాలో దాదాపు 70 లక్షల మంది కొత్త ఓటర్లు చేరారు. అది హిమాచల్ ప్రదేశ్ జనాభాతో సమానం. షిర్డీలోని ఒకే భవనంలో 7,000 మందికి పైగా ఓటర్లు చేరారు.ఏదో సమస్య ఉంది." అని రాహుల్ ధ్వజమెత్తారు. దేశంలో నిరుద్యోగం తాండవంచేస్తోందని విపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆయన లోక్‌సభలో రాష్ట్రపత్రి ప్రసంగంపై ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలను తీవ్ర నిరుత్సాహానికి గురిచేసిందని అన్నారు. రాష్ట్రపత్రి ద్రౌపది ముర్ము ప్రసంగంలో కొత్త విషయాలు ఏవి లేవని ఆక్షేపించారు. నేటికి దేశాన్ని నిరుద్యోగ సమస్య పట్టి పీడిస్తోందని కామెంట్ చేశారు.

## జగిత్యాల జిల్లాలో పట్టపగలు కిడ్నాప్ కలకలం

జగిత్యాల,ఫిబ్రవరి,3: జగిత్యాల జిల్లాలో పట్టపగలు కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. ఇంటి బయట ఆడుకుంటున్న పాప )ను ఓ దంపతుల జంట ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించగా.. స్థానికులు దేహశుద్ధి చేశారు. ఘటన ప్రకారం జగిత్యాల పట్టణం లోని చింతకుంట వాడ లో ఓ పాప తన ఇంటి ముందు ఆరు బయట ఆడుకుంటున్నది. అదే సమయంలో కిరాణా షాపు ఎక్కడ ఉం ది విచారిస్తూ.. చేతిలో పిల్లాడితో ఉన్న మహిళతో పాటు ఓ వ్యక్తి అటుగా వచ్చారు. ఆడుకుంటున్న పాపను చాక్లెట్ ఆశచూపి ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో పాప వాళ్లను చూసి భయపడి ఇంట్లోకి పరుగులు తీసింది. జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో తల్లిదండ్రుల తో పాటు ఇరుగు పొరుగు వారు పాపను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించిన జంటను పట్టుకున్నారు. వారిని విచారించగా..



సరైన సమాధానం రాలేదు. దీంతో వారిపై అనుమానం వచ్చి చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం జరిగిన ఘటనపై స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆ దంపతులను విచారించారు. తర్వాత వారిని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# రహదారుల కబ్జాలను వెంటనే తొలగించాలి

## - అధికారులకు హైడ్రా కమిషనర్ ఆదేశం - హైడ్రా ప్రజావాణికి 71 ఫిర్యాదులు







**హైదరాబాద్,మహానది బ్యూరో, ఫిబ్రవరి 03:** గ్రేటర్ హైదరాబాద్,శివారు ప్రాంతాలలో గేటెడ్ కమ్యూనిటీల మాదిరిగా కాలనీల చుట్టూ నిర్మించిన రహదారులను వెంటనే తొలగించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం హైడ్రా ప్రజావాణికి 71కిపైగా ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులపై అక్కడికక్కడే హైడ్రా అధికారులతో చర్చించి చర్యలకు హైడ్రా కమిషనర్ ఆదేశించారు. మొత్తం ఫిర్యాదుల్లో అధికభాగం పార్కులు, రహదారుల కబ్జాలే ఉన్నాయని.. లే-అవుట్ ప్రకారం రహదారులుండేలా చూడాలని సూచించారు. ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలను గూగుల్ మ్యాప్స్ ద్వారా పరిశీలించి.. దశాబ్దం క్రితం ఎలా ఉంది.. ఇప్పుడు ఎలా ఉందో తెలుసుకున్నారు. ఫిర్యాదు దారులకు కూడా చూపించి.. సమస్య పరిష్కారానికి చర్యలు సూచించారు. ఫిర్యాదుదారులు సంప్రదించాల్సిన హైడ్రా అధికారులను పరిచయం చేసి.. వారు విచారణకు వచ్చిన సమయంలో అన్ని వివరాలు అందజేయాలని సూచించారు.

ఒకప్పుడు సెప్టిక్ ట్యాంకుల కోసం కేటాయించిన స్థలాలను.. ఇప్పుడు వినియోగంలో లేవని..వాటిని ప్రజావసరాలకు కేటాయించిన స్థలంగానే పరిగణించాలని.. ఎవరైనా కబ్జాలు చేస్తే వెంటనే వాటిని తొలగించాలని కమిషనర్ అధికారులకు సూచించారు.

కాప్ర మున్సిపాలిటీలో వంపు గూడపక్కన ఉన్న ఎన్ఆర్ ఐ కాలనీవాళు ప్రహరీ నిర్మించారు. చందా నగర్ సర్కిల్ 21లోని మాతృశ్రీనగర్‌లో పార్కులో కొంత భాగాన్ని, పార్కులో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌ను కబ్జా చేశారంటూ ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మండలం, కోహెడ గ్రామంలో సమ్మిరెడ్డి బాల్ రెడ్డి తమ ప్లాట్లను కబ్జా చేశారంటూ పలువురు ఫిర్యాదు చేశారు. సర్వేనంబరు 951నుంచి 954లలో1986 లో గ్రామపంచాయతీ లే-అవుట్‌లో తాము ప్లాట్లు కొంటే వాటిని చూడలేని పరిస్థితి ఉందన్నారు. తమ ప్లాట్లను కొన్నింటిని కాజేసి ఫామ్ హౌస్ మాదిరి చుట్టూ ప్రహరీ నిర్మించుకుని ఎవరినీ అనుమతించడం లేదని హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

### నల్లమల్లారెడ్డి తమ ప్లాట్లను కాజేశారు

మేడ్చెల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం, కొర్రెముల గ్రామ పంచాయతీలో మా ప్లాట్లను నల్ల మల్లారెడ్డి కబ్జా చేశారు. సర్వే నంబరు 716 నుంచి 718లో గ్రామపంచాయతీ లే-అవుట్‌లో తనతో పాటు 23 మంది 1987లో కొన్న ప్లాట్లను నల్లమల్లారెడ్డి కాజేశారు. 2010లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖకు చెందిన రికార్డులను ట్యాంపెరింగ్ చేసి తన కబ్జాలో పెట్టుకున్నారు. నల్లమల్లారెడ్డిపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులుకూడా2013లో పెట్టాం.మొత్తం 23 కేసుల వివరాలతో ఆంధ్రప్రదేశ్ గెజిట్ కూడా ప్రచురితమైంది. విద్యాసంస్థల అధినేత నల్ల మల్లారెడ్డి మా ప్రైవేట్ ప్లాట్లను మాత్రమే కాకుండా, ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించి,తన రాజకీయశక్తిని ఉపయోగించి వాటిని అనుభవిస్తున్నాడు. ఈ నేపథ్య ంలో, హైడ్రా జోక్యం చేసుకోవడం అత్యంత అవసరం. హైడ్రా దీనిపై దర్యాప్తు చేపట్టినట్లయితే, మా ప్రైవేట్ ప్లాట్లతో పాటు ప్రభుత్వ భూమిని కూడా రక్షించవచ్చని బాధితులు పేర్కొన్నారు.

### యాప్రాల్ నాగిరెడ్డి గొలుసుకట్టు చెరువును కాపాడండి

మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం మల్కాజిగిరి మున్సిపాలిటీలోని యాప్రాల్ నాగిరెడ్డి గొలుసుకట్టు చెరువును ఫంక్షన్ హాల్ యజమానులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని.. గతంలో రెండు సార్లుస్థానిక ఎంఆర్‌వో కూల్చివేయగా.. ఇటీవల హైడ్రా కూడా కూల్చింది. ఈ చెరువు నాలాను పూర్తిగా ఆక్రమించిన ఫంక్షన్ హాల్ యజమానులపై చర్యలు తీసుకోవాలి. కబ్జాలను తొలగించి చెరువును కాపాడాలి. అనుమతి లేని ఫంక్షన్ హాల్‌ను తొలగించాలని యాప్రాల్ కులసంఘాల జేఏసీ ఛైర్మెన్ ఆర్. చంద్రశేఖర్ కోరారు.

### ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని ఇప్పించండి

తాను మాజీ సైనిక ఉద్యోగిని. ప్రభుత్వం తనకు కూకట్‌పల్లి – నిజాంపేట రోడ్డులోనిహోలిస్టిక్ ఆసుపత్రి వెనుక 300ల గజాల స్థలాన్ని కేటయించింది. తనకు ఇచ్చిన 300ల గజాలతో పాటు.. మొత్తం 1253 గజాల స్థలాన్ని స్థానిక మహిళ కబ్జాచేసిందని.. ఇదంతా ప్రభుత్వ స్థలమని.. కోర్టు ఉత్తర్వులతో పాటు.. ప్రభుత్వ ఆదేశాలున్నా తనకు 300ల గజాల స్థలందక్కడం లేదు. ప్రభుత్వ భూమిని కబ్జాదారు నుంచి కాపాడి.. తనకు ప్రభుత్వం కేటాయించిన 300ల గజాల స్థలం వచ్చేలా హైడ్రాచూడాలని మాజీ సైనిక ఉద్యోగి పి. సీతారామరాజు కోరారు.

# తప్పుల తడకగా కుటుంబ సర్వే నివేదిక

## - బీసీలను అణిచివేసే గణాంకాలను అంగీకరించబోం
## - స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కు బీసీలు గుణపాఠం చెబుతారు
## - బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



హైదరాబాద్, మహానది న్యూస్,

ఫిబ్రవరి 03: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కుటుంబ సర్వే నివేధిక పూర్తిగా తప్పుల తడకగా ఉందని, అందులో బీసీ జనాభాను తగ్గించి చూపించారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆరోపించారు. సోమవారం కాచిగూడ లోని అభినందన్ గ్రాండ్లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ నేతలు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, తంగెళ్ళమూడి నందగోపాల్ తో కలిసి ఆయన మాట్లాడుతూ బీసీ జనాభాను తగ్గించి చూపడంపై తక్షణమే సమగ్ర సమీక్ష జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కుటుంబ సర్వే ప్రకారం బీసీల జనాభా 52 శాతంగా ఉన్నట్లు పేర్కొనగా ప్రస్తుత కుల గణనలో బీసీల జనాభా 46.25 శాతంగా చూపించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఓసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లీంల జనాభా పెరుగుతుంటే కేవలం బీసీల జనాభా శాతం మాత్రంతగ్గినట్లు చూపించారని ఆయన పేర్కొన్నారు. 2011 తెలంగాణ లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్ర జనాభా 3.7కోట్లుగా ఉంటే, సర్వేలో 3.54 కోట్ల మందిగా లెక్కించారని ఆయన తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ యావరేజ్ పాపులేషన్ గ్రోత్ 13.5 శాతం కాగా, గత లెక్కల ప్రకారం బీసీ జనాభా సుమారు కోటి 84 లక్షలని, తెలంగాణ యావరేజ్ గ్రోత్ రేటు 13శాతం లెక్కన సుమారుగా 36 లక్షల జనాభా పెరిగి 2కోట్ల 20లక్షల బీసీ కుటుంబాల లెక్కలు రావాల్సి ఉందన్నారు. కానీ కావాలని తప్పుడు లెక్కలు చూపించి బీసీ జనాభాను కోటి 64 లక్షలకు తగ్గించి చూపించారన్నారు. సర్వేలో పాల్గొనని జనాభాను 10 లక్షలుగా చూపించారని అలాగే విదేశాల్లో స్థిరపడిన తెలంగాణ వాసులు లెక్కలు తీయలేదని ఆయన వివరించారు. గతంలో ఓసీల జనాభా 10శాతం లోపే అని చెబుతుండగా, ఈడబ్ల్యుస్ రిజర్వేషన్స్ ను కాపాడుకోనేందుకు ఇప్పుడు 15.79 శాతంగా చూపించారని ఆయన ఆరోపించారు. 10శాతం కంటే తక్కువ ఉన్న ఓసీలు 15శాతంకు పెరిగితే, బీసీల జనాభా శాతం మాత్రం పెరగకుండా ఎలా ఉంటుందని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలోని బీసీల సంఖ్యను తక్కువగా చూపించి,వారి రాజకీయ హక్కులను, విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను దెబ్బతీసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆయన ఆరోపించారు. ఈ సర్వే ఫలితాలను తక్షణమే సమీక్షించి పూర్తి పారదర్శకతతో నిజమైన గణాంకాలను వెల్లడించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ఉద్యమం చేయక తప్పదని ఆయన హెచ్చరించారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నిల్లో కాంగ్రెస్ పార్టీకి బీసీలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీసీ నేతలు మట్ట జయంతి, ఉదయ్, సత్యనారాయణ, ఆర్యా, మణికంత, తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో తెలంగాణకు
# తీవ్ర అన్యాయం..

## - అన్యాయంపై పార్టీ నాయకులు కార్యకర్తలకు ప్రజల్లోకి తీసుకెళ్లాలి
## - పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్, మహానది న్యూస్,ఫిబ్రవరి 03: కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందని, జరిగిన అన్యాయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, లేబర్ బోర్డ్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపులూరి కృష్ణ గౌడ్ లు పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని మర్యాద పూర్వకంగా కలిసి కేంద్ర బడ్జెట్ పై చర్చించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంత్రులు, ఆర్థిక శాఖ అధికారులతో విస్తృత సమావేశం నిర్వహించి, రాష్ట్రంలోని పలు పథకాలకు నిధులు కోరితే.. కేంద్రం ఏ విషయంలో కూడా సానుకూలంగా స్పందించలేదని, తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి గుండుసున్నా మిగిలిందని ఆయన కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. "మళ్ళీ.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిరాశ ఎదురైందన్నారు. పెండింగ్‌లో ఉన్న వాగ్దానాల జాబితాను నెరవేర్చడానికి బడ్జెట్‌పై భారీ ఆశలు పెట్టుకున్న తెలంగాణ ప్రజలకు ఇది తీవ్ర నిరాశ కలిగించిందని తెలిపారు. బడ్జెట్ పాన్ -ఇండియా విధానాన్ని తీసుకోవడం కంటే రాబోయే ఢిల్లీ, బీహార్ ఎన్నికలపై ఎక్కువ దృష్టి పెట్టినట్లు కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. తప్పనిసరి ఆర్థిక వికేంద్రీకరణలు, కేంద్ర గ్రాంట్లకు మించి తెలంగాణ ప్రత్యేక సహాయం పొందలేకపోయిందని అన్నారు. గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించకపోవడం ద్వారా



బడ్జెట్ ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014ను గౌరవించడంలో కూడా విఫలమైందన్నారు. తెలంగాణలో బిజెపికి 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు ఉన్నా మరోసారి బడ్జెట్ జీరోగా మారడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. ఒక్క ప్రత్యేక ప్రాజెక్టును కూడా సాధించలేకపోతే లేదా ఏదైనా ప్రధాన డిమాండ్‌ను నెరవేర్చలేకపోతే 8 మంది బీజేపీ ఎంపీలను ఎన్నుకోవడం వల్ల ఉపయోగం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మోదీ సర్కార్ ద్రోహం చేసిందని, మెట్రో విస్తరణకు కేంద్రం వాటా కింద నిధులు కేటాయించలేదని, మూసీ పునరుజ్జీవం కోసం రూ.4 వేల కోట్లు అడిగితే రూపాయి కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఐఐటీ, ఐఐఎం, ఐఐఐటీ, నవోదయ, సైనిక్ స్కూల్స్? గురించి ప్రస్తావనే లేకపోవడం విచారకరమని అన్నారు. అలాగే కొత్త విమానాశ్రయాలకు నిధులు కోరినా ఇవ్వలేదని ఆగ్రహ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధాత్రిక్ చందులాల్ పటేల్, తోలుపునూరి నరేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా,రైతుబీమా పథకాలు ఎక్కడ : కౌశిక్‌రెడ్డి



కరీంనగర్: సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నేతలను వేధించడమే పనిగా పెట్టుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎక్కడికిపోయాయని ప్రశ్నించారు. హామీల అమలు ఎక్కడ అని ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు భరోసా, రైతుబీమా పథకాలు ఎక్కడఅనిసీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. అక్రమ కేసులతో కేటీఆర్‌ను వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. ఫార్ములా-ఈ రేసు నిర్వహణకు ప్రపంచ దేశాలు పోటీపడతాయని చెప్పారు. దేశంలోని ఎన్నో రాష్ట్రాలు రేసు నిర్వహణకు పోటీపడ్డాయి. కేటీఆర్ ఎంతో కష్టపడి హైదరాబాద్‌లో ఈ రేసును నిర్వహించారని తెలిపారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచితే కేసులు పెడతారా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలనను మరిపిస్తున్నారని మండిపడ్డారు. ఫార్ములా-ఈ రేస్ నిర్వహణతో టెస్లా వంటి ఎన్నో పెద్ద కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయని చెప్పారు. ఓటుకు నోటు కేసులో దొంగ కాబట్టి..రేవంత్ అందరూ దొంగలే అనుకుంటున్నారని విమర్శించారు. అవినీతిఅనేదే లేనప్పుడు ఈడీ కేసు ఎలా పెడుతుందన్నారు. ఒకసారి తెలంగాణ ప్రజలు ఆలోచించాలని కోరారు. తెలంగాణలో డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయని చెప్పారు. కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావులను అరెస్టు చేసి రాష్ట్రాన్ని దోచుకోవాలని రేవంత్ చూస్తున్నారని ఆరోపించారు. సంజయ్ కుమార్ కోట్లాది రూపాయలకు అమ్ముడు పోయాడని, అందుకే నీది ఏ పార్టీ అని అడిగానని చెప్పారు. మా బట్టలు విప్పుతామంటే ఊరుకోవాలా అని ప్రశ్నించారు. సంజయ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీలో లేకుంటే వార్డు మెంబర్‌గాకూడా గెలవడంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. కరీంనగర్ సమీక్ష సమావేశంలో మంత్రుల ఆదేశాల మేరకు ఎమ్మెల్యేనైన తనను అంతా బెదిరించారని చెప్పారు. కరీంనగర్ ఆర్డీవో ఎవరో తనకు తెలియదని, ఆయన తనపై ఎలా కేసు పెడతారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి గతంలో మంత్రి డీకే అరుణని తిట్టలేదా, జూపల్లి కృష్ణారావుని నోటికొచ్చినట్లు మాట్లాడితే ఆయనపై కేసు పెట్టారన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమారే తనపై దాడి చేశాడన్నారు. సమావేశంలో తనది కాంగ్రెస్ పార్టీ అని అధికారుల సమక్షంలో చెప్పిన సంజయ్ కుమార్‌ను డిస్ క్వాలిఫై చేయాలని డిమాండ్ చేశారు. తనపై ఎలాంటి క్రిమినల్ కేసు, ల్యాండ్ గ్రాబింగ్ కేసులు లేవని,పీడీయాక్ట్ ఎలా పెట్టాలని చూస్తున్నారని ప్రశ్నించారు.ఒకవేళ పెట్టాలనుకుంటే రేవంత్ రెడ్డితో మొదలు పెట్టాలన్నారు. 13నెలల్లో అక్రమ అరెస్టులు తప్ప రేవంత్ రెడ్డి రాష్ట్రంలో చేసిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఒక్క హామీ నెరవేర్చకుండా 13 నెలలుగా రేవంత్ సర్కార్ కాలయాపన చేస్తున్నదని విమర్శించారు.

# ఉద్యమాలే రైతులకు ఊపిరి

## భాగం హేమంతరావు




ఖమ్మం: రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే ఊపిరిగా రైతులు పక్షాన నిలబడతాయని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు భాగం హేమంతరావు అన్నారు గుమ్మడిల్లి సైదారావు అధ్యక్షతన జరిగిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం తనికెళ్ల గ్రామ శాఖ మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం అధికారుల వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం కార్పొరేట్ శక్తులకు ధారాధత్వం చేస్తూ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేందుకు నిరంతరం కుట్ర చేస్తున్నారనివారు ఆరోపించారు ఎన్నికల ముందు రైతులకు హామీలు ఇచ్చిన పాలకులు హామీలను విస్మరిస్తున్నారని వారు పేర్కొన్నారు రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాజీలేని సమరశీల పోరాటాలకు సమేతంగా వాళ్లని వారు పిలుపుని చ్చారు రైతు ఉద్యమాన్ని అనిసి వేసే కుట్రలు మానుకోవాలని లేకుంటే గల్లీ నుంచి ఢిల్లీ దాకా రైతుల ఐక్య ఉద్యమాలు కొన సాగిస్తామని వారు హెచ్చరించారు పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు సమగ్ర వ్యవసాయ పంటల మద్దతు ధర చట్టం ఏర్పాటు చేయాలని సాదా బైనామ ద్వారా రైతులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని పంటల బీమా పథకం ఏర్పాటు చేసి అమలు చేయాలని ఏర్పాటు చేసి అమలు చేయాలని గ్రామ గ్రామాన వ్యవసాయ గోదాములు నిర్మించాలని రైతులకు హెల్త్ ఇన్సూరెన్స్ పది లక్షల వరకు వర్తింపు జరగలా కార్డు లు ఇవ్వాలనివారు ప్రభుత్వాన్ని కోరారు మహాసభలో జిల్లా అధ్యక్షులు కార్యదర్శి దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు సిపిఐ జిల్లా నాయకులు ఎర్రబాబు పివి రావు కూచిపూడి రవి సిపిఐ కార్యదర్శి యాస వెంకటేశ్వర్లు రైతు సంఘం మండల కార్యదర్శి తండు సోమయ్య ఎస్టియు జిల్లా నాయకులు గడల భాస్కర్ గోపాలరావు రైతు నాయకులు పెద్దమల్ల రత్తయ్య లకావత్తు రాములు భాష నాగరాజు తదితరులు పాల్గొన్నారు తనికెళ్ల గ్రామ శాఖ రైతు సంఘం అధ్యక్షులుగా ఉమ్మడెల్లి సైదరావు ప్రధాన కార్యదర్శిగా లకావత్ రాములు ఉపాధ్యక్షులుగా ఆకుతోట శంకరరావు జి రామారావు బి రామారావు కోశాధికారి పొట్లపల్లి నరేష్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసరావు తో పాటు 13 మందిని సభ్యులుగా మహాసభను ఎన్నుకున్నారు.

# సంపాదకీయం

## మాంద్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగం 2008 ఆర్థిక సంక్షోభం తర్వాత తగ్గిందన్నది నిస్సందేహం. అమెరికాలోని కొందరు మితవాద ఆర్థికవేత్తలు సైతం 'ఇది దీర్ఘకాలిక మాంద్యం' అంటున్నారు (ఆ పదానికి వారిచ్చే నిర్వచనం వింతగా ఉంటుంది). ఈ అంశాన్ని కొన్ని గణాంకాల ద్వారా వివరించడం ఈ వ్యాసం ఉద్దేశం. జిడిపి ని (స్థూల జాతీయోత్పత్తి) లెక్కించే విధా నాలు ఆ యా దేశాల్లో చాలా వరకూ విశ్వసనీయత కలిగినవి కావు. ఇక మొత్తం ప్రపంచానికి సంబంధించి ప్రత్యేకంగా చెప్పనవసరమే లేదు. భారత దేశంలో అధికారిక లెక్కలను అనేకమంది పరిశోధకులు ప్రశ్నిస్తున్నారు. అధికారులేమో 7 శాతం, ఆ పైబడి వృద్ధిరేటు ఉన్నట్టు చూపుతున్నారు. కాని ఈ పరిశోధకులు అది 4 శాతం నుండి 4.5 శాతానికి మించదని, ఈ పరిస్థితి గత కొన్ని సంవత్సరాలుగా ఇదే మాదిరిగా ఉంటోందని గట్టిగా చెప్తున్నారు. ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థ కొనసాగిన గత కాలంతో పోల్చి నయా ఉదారవాద విధానాల కాలంలో జిడిపి వృద్ధిరేటు గురించి చంకలు గుద్దుకోవడం అర్థం లేనిది. గత కాలంతో పోల్చితే వృద్ధిరేటు పెరిగింది పెద్దగా లేదు. పైగా అసమానతలు బాగా పెరిగిపోతున్నాయి. పోషకాహార లభ్యత గురించి లభిస్తున్న గణాంకాలను బట్టి శ్రామిక ప్రజానీకపు స్థితిగతులు బాగా క్షీణించాయని స్పష్టంగా చెప్పవచ్చు. అంత నిలకడ లేని ఈ జిడిపి గణాంకాలను పక్కనపెట్టి ప్రపంచ జిడిపి సంగతేమిటో చూద్దాం. ఇందుకోసం నేను ప్రపంచబ్యాంక్ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటున్నాను. 2015 నాటి ధరలు ఆ యా దేశాల్లో ఎలా ఉన్నాయో, పరిశీలించి, వాటిని 2015 నాటి డాలర్‌తో ఆ యా దేశాల కరెన్సీ మారకపు రేటును లెక్కలోకి తీసుకుని ఆ ప్రాతిపదికన జిడిపి లెక్కలను అంచనా కట్టారు. 1961 నుంచీ గడిచిన కాలాన్ని కొన్ని ఉప కాలాలుగా విభజించి ఆ యా ఉప కాలాలలో వృద్ధి ఏ విధంగా ఉన్నదీ పరిశీలించడం కొంచెం చిక్కులతో కూడుకున్న విషయమే. ఒక దశాబ్ద కాలాన్ని ఒక ఉప కాలంగా విభ జిస్తే గనుక దానిలో ఒక సమస్య వస్తుంది. ఆ దశాబ్దపు మొదటి ఏడాది గనుక వృద్ధి రేటు బాగా తక్కువగా ఉంటే, దాంతో పోల్చినప్పుడు తక్కిన దశాబ్దకాలం యావత్తూ వృద్ధిరేటు చాలా ఎక్కువగా జరిగినట్టు లెక్క వస్తుంది. అందుచేత సరైన అంచనాలకు రావడానికి వీలుగా నేను 1961 నుంచీ గడిచిన కాలంలో బాగా ఎక్కువ వృద్ధిరేటు సాధించిన సంవత్సరాలను ఎంచుకున్నాను. ఆ విధంగా చూసినప్పుడు 1961, 1973, 1984, 1997, 2007, 2018 సంవత్సరాలలో అత్యధిక వృద్ధిరేటు జరిగినట్టు తేలింది. ఇప్పుడు వీటిలో ప్రతీ రెండింటి మధ్య కాలంలోని వృద్ధిరేటును పరిశీలించాను. ఆ రేట్లు ఈ విధంగా (పట్టిక) ఉన్నాయి. పట్టికలోని అంకెలను బట్టి మూడు నిర్ధారణలు చేయవచ్చు. మొదటిది: మొత్తంమీద చూసినప్పుడు ప్రభుత్వాల నియం త్రణలో దేశాల ఆర్థిక వ్యవస్థలు నడిచినప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు నయా ఉదారవాద కాలంలోని వృద్ధిరేటు కన్నా చాలా ఎక్కువగా ఉంది. "మార్కెట్టే సర్వ శక్తి సంపన్నం" అంటూ ఇప్పుడు జరుగుతున్న చర్చల్లో నయా ఉదారవాద కాలంలోనే జిడిపి వృద్ధిరేటు బాగా ఎక్కువగా ఉందన్న అభిప్రాయం కలుగుతుంది. ఈ అభిప్రాయం పూర్తిగా తప్పు. వాస్తవానికి నయా ఉదారవాద కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు గణనీయంగా మందగించింది. రెండవది: ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థలు నడిచిన కాలానికి, నయా ఉదారవాద విధానాలు అమలు కావడం మొదలైన నాటికి మధ్య కొంత వ్యవధి ఉంది. ఈ కాలంలో వృద్ధిరేటు 5.4 శాతం నుండి 2.9 శాతానికి పడిపోయింది. 1967 నుండి ద్రవ్యోల్బణం వేగవంతం అయి 1973-74 వరకూ కొనసాగింది. దానిని అదుపు చేయడానికి పెట్టుబడిదారీ వర్గం ప్రభుత్వ వ్యయాన్ని కుదిస్తూ, భారీ స్థాయిలో నిరుద్యోగాన్ని పెంచే వ్యూహాన్ని అనుసరించింది. ఈ వ్యూహం ఫలితంగా 1973 నుంచీ వృద్ధిరేటు మందగించింది. అప్పటి నుంచీ దేశాల ఆర్థిక వ్యవస్థల మీద ప్రభుత్వాల నియంత్రణ ఉండే విధానం నిలిచిపో యింది. ఇలా వృద్ధిరేటు మందగించిపోవడం నయా ఉదారవాద విధానాలను ప్రవేశపెట్టడానికి కావలసిన భూమికను కల్పించింది. అప్పటికే పెరుగుతూ అంతకంతకూ అంతర్జాతీయ స్వభావాన్ని సంతరిం చుకుంటున్న ద్రవ్య పెట్టుబడి అంతకు ముందునుంచే నయా ఉదారవాద విధానాలకు మళ్ళాల్సిందేనంటూ ఒత్తిడి పెంచుతోంది. సరిగ్గా ఆ సమయానికే పాత విధానాల పర్యవసానంగా ముందు ద్రవ్యోల్బణం, తర్వాత వృద్ధిరేటు మందగించడం జరిగాయి. మూడవది: పైన ఇచ్చిన అంకెలను చూస్తే అమెరికాలో హౌసింగ్ బుడగ పేలిపోయిన అనంతర కాలంలో వృద్ధిరేటు మందగమనం కొనసాగుతూనే వుంది. హౌసింగ్ బుడగ బద్దలైపోవడంతో పెట్టుబడిదారీ ప్రపంచం మొత్తంగా సంక్షోభంలో పడింది. అప్పుడు ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున జోక్యం చేసుకుంది (ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వాల జోక్యం ఉండరాదనే నయా ఉదారవాదం బండారం దీనితో బైటపడింది). కాని వాస్తవ ఆర్థిక వ్యవస్థకు దాని నుంచి ఎటువంటి ప్రేరణా లభించలేదు. వృద్ధిరేటును పెంచడానికి ప్రభుత్వాల వ్యయం పెరగడం గాని, హౌసింగ్ బుడగ వంటి మరేవైనా బుడగలు ఏర్పడి తాత్కాలికంగా వృద్ధిరేటు వేగాన్ని పెంచడానికి దోహదం చేయడం వంటివి కాని జరగలేదు. మనం 2018 సంవత్సరాన్ని ఆఖరి గరిష్ట వృద్ధి సంవత్సరంగా తీసుకున్నాం. ఆ తర్వాత చూస్తే వృద్ధిరేటు మరీ అన్యాయంగా పడిపోయింది. 2018 నుంచి 2022 మధ్య వృద్ధిరేటు సాలుకు 2.1 శాతం మాత్రమే ఉంది. ప్రపంచ జనాభా వృద్ధిరేటు సుమారు 1 శా తంగా ఉంది (మన దేశ జనాభా లెక్కలు 2021లో సేకరించి వుండా ల్సింది. కాని ఇంతవరకూ ఆ పని ప్రారంభం కానేలేదు.). దీనిని పరిగణనలోకి తీసుకుంటే ప్రపంచ తలసరి ఆదాయం ఒక శాతం చొప్పున మాత్రమే పెరుగుతున్నట్టు భావించాలి. ఐతే, ప్రపంచంలో ఆదాయాల మధ్య అసమానతలు బాగా పెరుగుతున్నాయి. దానిని బట్టి ప్రపంచ జనాభాలో అత్యధిక మెజారిటీ ఆదాయాలలో పెరుగుదల లేకుండా స్తంభించిపోవడం కాని తరిగిపోవడం కాని జరుగుతోంది. దీనిని వివరించడానికి దిగువ విషయాన్ని ఉదహరిస్తాను. ప్రపంచ ఆదాయం మొత్తంలో సగభాగం కన్నా ఎక్కువ జనాభాలోని అత్యంత సంపన్నులైన 10 శాతం ప్రజలు పొందుతున్నారు. వీరి ఆదాయాలు ఏటా కనీసం 2 శాతం చొప్పున పెరుగుతున్నాయనుకుంటే అప్పుడు తక్కిన 90 శాతం మంది ఆదాయాలూ ఏ పెరుగుదలా లేకుండా స్తంభించిపోయినట్టే కదా. అంటే నయా ఉదారవాదం చివరి దశలో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచ జనాభాలో అత్యధిక ప్రజానీకపు ఆదాయాలు పెరుగుదల లేకుండా స్తంభించిపోయేట్టు చేసిందని స్పష్టం అవుతోంది. ఇది పాత వలస పాలనా కాలాన్ని గుర్తుకు తెస్తోంది. అప్పుడు కూడా ప్రపంచంలోని అత్యధిక శాతం ప్రజల నిజ ఆదాయాలు పెరగకపోగా తరిగిపోయాయి. ఇలా వృద్ధిరేటు మందగించడం అనేది కొద్ది కాలంపాటు మాత్రమే ఉండే తాత్కాలిక సమస్య అని, త్వరలోనే దీనిని అధిగమిస్తామని అనుకోలేం.

# అఖండ భారత్ అడుగులు..


ప్రపంచంలో కొత్త ట్రెండ్ మొదలయ్యింది. గత శతాబ్దంలో పూర్వపు అవిభక్త రాజ్యాల పాలన కాదని ఎన్నో దేశాలు స్వతంత్ర దేశాలుగా ప్రకటించుకున్నాయి. అయితే, ఇప్పుడు రష్యా, చైనా? చివరికి అమెరికా సామ్రాజ్యవాదం దిశగా అడుగులేస్తున్నాయి. రష్యా ఉక్రెయిన్‌ను సొంతం చేసుకోవాలని చూస్తున్నా? చైనా తైవాన్‌ను ఆక్రమించాలనుకున్నా? అటు, కొరియాల గొడవైనా? ఇటు, మిడిల్ ఈస్ట్ యుద్ధమైనా? స్పష్టంగా సామ్రాజ్యాలను విస్తరించుకోవాలనే ఉద్దేశం గట్టిగానే ఉంది. చివరికి అమెరికా సైతం? కెనడా, మెక్సికో, పనామా, గ్రీన్ ల్యాండ్‌లను కలుపుకోడానికి ఆసక్తిగా ఉంది. ఇటీవల, దీనిపై అమెరికాకు కాబోయే ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక, ఇప్పుడు భారత్ కూడా ఇదే దిశగా అడుగులేస్తుందా అనే సందేహం కలుగుతుంద భారత వాతావరణ శాఖ 150 ఏళ్లను పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'అవిభక్త భారతదేశం' సెమినార్‌లో పాల్గొనాలని పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లతో పాటు ఇతర పొరుగు దేశాలను భారతదేశం ఆహ్వానించింది. విభేదాలను పక్కనపెట్టి, భారత ఉపఖండం ఉమ్మడి చరిత్రను ఐక్యంగా జరుపుకోవడానికి ప్రభుత్వం చేపట్టిన తొలి ప్రయత్నం ఇది. ఇందులో భాగంగా? పొరుగున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్, ఆఫ్ఘనిస్తాన్, మయన్మార్, మాల్దీవులు, శ్రీలంక, నేపాల్‌లకు ఆహ్వానాలు పంపారు. ఉపఖండంతో పాటు, మధ్యప్రాచ్యం, మధ్య-నైరుతి ఆసియా దేశాలకు కూడా ఆహ్వానాలు పంపించారు. అయితే, పాకిస్తాన్ ఇప్పటికే తాము పాల్గొంటామని ధృవీకరించింది. ఇక,బంగ్లాదేశ్ నుండి ధృవీకరణ కోసం భారత్ వేచి ఉంది. బంగ్లాదేశ్ఓకే అంటే మాత్రం? ఈ సమావేశం ఒక చారిత్రాత్మక క్షణంగా మిగిలిపోతుంది. భారత వాతావరణ సంస్థ స్థాపన సమయంలో అవిభక్త భారతదేశంలో భాగమైన అన్ని దేశాల అధికారులు ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరుతున్నట్లు ఆహ్వానంలో పేర్కొన్నారు. ఇక, ఈ ప్రత్యేక సందర్భాన్ని గుర్తుచేసుకోడానికి భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ రూ.150 రూపాయల స్మారక నాణెం కూడా విడుదల చేయాలని నిర్ణయించారు.ఒకసారి, భారత వాతావరణ శాఖ చరిత్ర చూస్తే? ఈ శాఖ, జనవరి 15, 1875న స్థాపించబడింది. అయితే, దీని కంటే చాలా కాలం ముందుగానే వాతావరణ అబ్జర్వేటరీలు ఏర్పాటయ్యాయి. మొదటి వాతావరణ అబ్జర్వేటరీలను బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ స్థాపించగా? కలకత్తా అబ్జర్వేటరీ 1785లో,మద్రాస్ అబ్జర్వేటరీ 1796లో, బాంబే అబ్జర్వేటరీ 1826లో ప్రారంభమైంది. ఇక,19వ శతాబ్దం ప్రారంభంలో అనేక అబ్జర్వేటరీలను స్థాపించారు. ఇప్పుడు, ఇవి భారత ఉపఖండం అంతటా విస్తరించాయి. 1864లో వచ్చిన తుఫాను కలకత్తాను నాశనం చేసిన తర్వాత? 1866, 1871లో రెండు ఘోరమైన రుతుపవనాల వైఫల్యాల వల్ల బెంగాల్ అంతటా కరువు ఏర్పడింది. దాని తర్వాత 1875లో భారత వాతావరణ శాఖ ఉనికిలోకి వచ్చింది.బ్రిటిష్ పాలనలో అడ్మినిస్ట్రేటివ్ రికార్డుల నిర్వహణ, డేటా విశ్లేషణ అవసరమని నిర్ణయించిన తర్వాత భారత వాతావరణ శాఖ ఏర్పాటయ్యింది. కాబట్టి, వాతావరణ పరిశీలనల సేకరణ, విశ్లేషణ ఒకే భవనంలో ప్రారంభమయ్యాయి. భారత వాతావరణ శాఖ అనే సంస్థగా దీన్ని పేర్కొన్నారు. ఇక, 1875లో ప్రారంభమైనప్పటినుండి, ఐఎండి ప్రధాన కార్యాలయం కలకత్తాలోనే ఉంది. 1905లో దీనిని సిమ్లాకు, తర్వాత 1928లో పూణేకు? చివరికి 1944లో న్యూఢిల్లీకి తరలించారు. అప్పటి నుండి అది అక్కడే ఉంది. అయితే, సంవత్సరాలుగా ఐఎండి ఒక సాధారణ స్థాయి నుండి ఆసియాకు ప్రముఖ వాతావరణ సూచన సంస్థగా మారింది. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి, ఐఎండి వాతావరణ శాస్త్రాలు, కమ్యూనికేషన్, శాస్త్రీయ ఆవిష్కరణలలో గణనీయమైన పురోగతిని సాధించింది. భారత అంతరిక్ష సంస్థ ఇస్రో స్థాపించబడినప్పుడు, దానితో సహకరించిన మొదటి వాటిలో వాతావరణ శాఖ ఒకటి. 24 గంటల వాతావరణ పర్యవేక్షణ మరియు తుఫాను హెచ్చరికల కోసం తన సొంత భూస్థిర ఉపగ్రహం ఎటొయిను ప్రయోగించిన మొదటి అభివృద్ధి చెందుతున్న దేశంగా భారతదేశం నిలిచింది. కాబట్టే భారత వాతావరణ శాఖ 150వ వార్షికోత్సవాన్ని అఖండ భారత్ ఆశకు వేదిక చేసినట్లు కనిపిస్తోంది. ఇటీవల? ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవంలో కూడా అఖండ భారత్ అంశం చర్చకు దారి తీసింది. కొత్త పార్లమెంట్ భవనంలోని ఓ గోడపై ఉన్న మ్యాప్ శతాబ్దాలకు ముందు ఉన్న భారతదేశాన్ని సూచించే విధంగా రూపొందించారు. అందులో ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్న తక్షశిల,మరికొన్ని రాజ్యాలు కూడా ఉన్నాయి. ఈ మ్యాప్‌ని ట్విట్టర్‌లో షేర్ చేసిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి.. 'సంకల్పం సుస్పష్టం..అఖండ భారత్' అంటూ ట్వీట్ చేశారు. ప్రాచీన యుగాలలో భారతీయ ప్రభావాన్ని చిత్రించాలనే ఉద్దేశంతో? వాయువ్య ప్రాంతంలోని ప్రస్తుత అఫ్గనిస్థాన్ నుంచి ఆగ్నేయ ఆసియా వరకు విస్తరించిని అఖండ భారత్ చిత్రాన్ని చెక్కారు.

# మంచుకొండల్లో పొంచి ఉన్న ముప్పు!



టిబెట్ భూభాగంతో ఉన్న టెక్టోనిక్ ప్లేట్లతో సంఘర్షిస్తున్నాయి. ఇప్పటికే, ఏడాదికి 2మిల్లీ మీటర్ల చొప్పున భారత భూభాగం కూడా తగ్గుతున్నట్లు ఇటీవలి అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది, రాబోయే కాలంలో మరింత భయానక భూకంపాలకు కారణమవుతుందా..? హిమాలయాలకు భూకంపం టెన్షన్ పట్టుకుంది. చల్లని వాతావరణాన్ని పంచే హిమాలయాల భూగర్భంలో తీవ్రమైన యుద్ధమే జరుగుతుంది. ఖండాలను చీల్చే టెక్టోనిక్ ప్లేట్ల మధ్య ఘర్షణతో.. హిమాలయన్ రీజన్ భయంకరమైన భూకంపాలకు కారణం అవుతోంది. అసలు, ఆ ప్రాంతంలో ఏం జరుగుతోంది..? టెక్టోనిక్ ప్లేట్ల సంఘర్షణతో వచ్చిన టెన్షన్ ఏంటీ..? రీసెంట్‌గా వచ్చిన టిబెట్ భూకంపానికి మించిన డేంజర్ భవిష్యత్తును భయపెడుతోందా..?విశ్వంలోనే అత్యంత అందమైన గ్రహం భూమి అంటారు. భూమిపైన వాతావరణం ఎంత అందంగా ఉంటుందోనని సంబరపడతారు. అయితే, భూమి లోపల ఏం జరుగుతుందో అందరికీ తెలియకపోవచ్చు. ఈ అందం కింద ఎంత విధ్వంస్వం దాగుందో అర్థం కాదు. ఇక, భారతదేశానికి తలమానికైన అద్భుత హిమాలయ ప్రాంతం కింద కూడా ఘోరమైన సంఘర్షణ జరగుతోందని ఎప్పటి నుండో అధ్యయనాలు చెబుతున్నాయి. హిమాలయన్ రీజన్‌లో రెండు భూ ఫలకాల మధ్య భారీ వత్తిడి పెరుగుతోంది. ఇది, భారత్, టిబెట్ దేశాల్లో దేనినైనా చీల్చడానికి అవకాశం ఉంది.ఈ ఏరియాలో రాబోయే తీవ్రమైన భూకంపాలతో ఒక ప్రాంతం సర్వనాశనమయ్యే ప్రమాదమూ ఉరనేది నిపుణుల అభిప్రాయం. ఇదే ఇప్పుడు భారత్‌ను కూడా భయపెడుతోంది. కొన్నేళ్లుగా హిమాలయన్ ప్రాంతంలో టెక్టోనిక్ ప్లేట్ల మధ్య మార్పులు కనిపిస్తున్నాయి. చాప కింద నీరులా.. ఈ ప్రాంత భూభాగం కింద టెక్టోనిక్ ప్లేట్లు జారిపోతూ ఉన్నాయి. టిబెట్, నేపాల్ సరిహద్దుల్లో భారీ భూకంపం సంభవించింది. జనవరి 7న సంభవించిన ఈ భయానక భూకంపంలో 126 మంది ప్రాణాలు కోల్పోగా.. 188 మంది గాయపడ్డారు. 400 వందల కంటే ఎక్కువ మంది భవన శిథిలాల కింద చిక్కుకున్నారు. ఇప్పటికీ ఇక్కడ సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇది ఎంత తీవ్రంగా వచ్చిందంటే.. 24 గంటల్లో దాదాపు 20 సార్లు భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 7.1గా నమోదైంది. జనవరి 8న సంభవించిన భూకంప తీవ్రంత 6.58గా నమోదయ్యింది.వరుసగా వచ్చిన ప్రకంపనల్లో 10 సార్లు 6 తీవ్రతతో భూకంపం ఏర్పడింది. భూకంపాలకు ప్రసిద్ధి చెందిన టిబెట్ ప్రాంతంలో గత సంవత్సరం 100 భూకంప సంఘటనలు జరగ్గా అవి కనీసం 3.0 తీవ్రతతో వచ్చినట్లు డేటా వెల్లడిస్తోంది. అయితే, 7 తీవ్రతకు మించిన చాలా తక్కువే అయినప్పటికీ.. 20వ శతాబ్దం ప్రారంభం నుండి ఇప్పటి వరకూ 7 తీవ్రత దాటిన భూకంప సంఘటనలు 9 సార్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక, ఇప్పుడొచ్చిన భూకంప తీవ్రతకు వెయ్యి కంటే ఎక్కువ ఇళ్లు దెబ్బతిన్నాయి. ఈ ప్రాంతంలో భారీ జనసాంద్రత ఉండటం వల్ల వందల మంది నిరాశ్రయులుగా మారాల్సి వచ్చింది.ఈ భూకంప ప్రభావం ఒక్క టిబెట్‌ను మాత్రమే కాకుండా నేపాల్, భారత్‌లలో కూడా కనిపించింది. టిబెట్‌లోని డింగ్రి కౌంటీ చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత అధికంగా ఉంది. ఈ భూకంపం ధాటికి భవనాలు నేలమట్టం అయ్యాయి. టిబెట్ సరిహద్దుని ఆనుకుని ఉన్న నేపాల్‌లోని 7జిల్లాల్లో భూకంపం ప్రభావం కనిపించింది. నేపాల్-టిబెట్ సరిహద్దుకు 93 కిలోమీటర్ల దూరంలోని లబుచె ప్రాంతంలో ఉదయం 6.30 గంటలకు ఈ భూకంపం సంభవించింది. టిబెట్‌లోని షిజాంగ్‌లో 10 కి.మీ లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మొత్తం ఆరుసార్లు భూకంపం వచ్చినట్టు చెప్పారు., టిబెట్‌లో విధ్వంసం సృష్టించిన ఈ భూకంప కేంద్రం.. నేపాల్-భూటాన్ సరిహద్దు వైపు ఉన్న ఎవరెస్టు శిఖరానికి కేవలం 80కిలోమీటర్ల దూరంలోనే ఉంది. భూకంపానికి కారణమైన కేంద్ర భాగం.. భూ ఉపరితలం నుంచి 10కి. మీ. లోతులో ఉన్న ట్లు భూకంప పరిశీలకులు వెల్లడించారు. ఈ ప్రాంతాన్ని లాసా రీజియన్ అని పిలుస్తున్నారు. ఇది హిమాలయన్ ప్రాంతంలో భౌగోళికంగా అత్యంత కీలకమైన ప్రదేశంగా ఉంది. ఈ ప్రాంతానికి ఉత్తరం వైపు.. బ్యాంగాంగ్- నుజియాంగ్ జోన్ ఉండగా.. దక్షిణం వైపు ఇండస్- యార్లింగ్ జాంగ్బో సరిహద్దులు ఉంటాయి.ఇక్కడ భూ ఫలకాల్లో మార్పులు సంభవించినప్పుడల్లా దాని ప్రభావం ఈ ప్రాంతంపై పడుతుంది. అందుకే తరచూ ఇక్కడ భూకంపాలు ఏర్పడుతుంటాయి. గత రికార్డులు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసాయి. ఇండియన్, యురేషియన్ టెక్టోనిక్ ప్లేట్ల మధ్య నిత్యం జరుగుతున్న ఘర్షణలు ఈ భూకంపాలకు కారణం అవుతున్నాయి. అయితే, భవిష్యత్‌లో మరింత ప్రమాదకరమైన భూకంపాలు వచ్చే అవకాశమున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.పురాతన ఖండం గోండ్వానాలో ఒక భాగంగా ఉన్న భారత భూభాగం.. 10 కోట్ల సంవత్సరాల క్రితం ఇతర శకలాల నుంచి భారత టెక్టొనిక్ ప్లేట్‌గా విడిపోయింది. ఇది ఉత్తరం వైపు కదులుతూ వచ్చింది. ప్రస్తుతం, భారత ఉపఖండం, దక్షిణ చైనా, పశ్చిమ ఇండోనేషియాలో కొంత భాగం వరకు ఈ ప్లేట్ విస్తరించి ఉంది. ఇది 5 కోట్ల సంవత్సరాల నుంచి యురేషియన్ ప్లేట్‌ను ఢీ కొడుతూ ఉంది. దాని ప్రభావంతోనే హిమాలయ శ్రేణులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం, ఈ టెక్టోనిక్ ప్లేట్.. యురేషియన్ ప్లేట్ వైపు ఏటా 5 సెంటీమీటర్ల మేర కదులుతూ.. దాన్ని ఢీకొంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.గతంలో కూడా హిమాలయాల మధ్య భాగాలైన నేపాల్‌లోని ఖాట్మండు, భారతదేశంలోని డెహ్రా డూన్ మధ్య గతంలో పెద్ద భూకంపం సంభవించిందనీ.. భవిష్యత్తులో అలాంటి మరో భూకంపం వస్తుందని శాస్త్రవేత్తలు అనుమానిస్తున్నారు. అందులోనూ, భారతీయ టెక్టోనిక్ ప్లేట్ హిమాల యాల క్రింద సంవత్సరానికి 1.8 సెంటీమీటర్ల మేర ఒక పెద్ద లోపంతో కదులుతున్నట్లు తెలుస్తోంది. ఇది ఆసియా వైపు భారతదేశ మొత్తం ప్లేట్ కదలికలో మూడింట ఒక వంతు. అంటే, సంవత్సరానికి 5.4 సెంటీమీటర్లు. ఇక, మిగిలిన ప్లేట్ కదలిక రేటు టిబెట్, మధ్య ఆసియాలోని ఇతర ప్రాంతాల్లో ఉంది.అయితే, ఈ టెక్టోనిక్ ప్లేట్ల కదలిక ప్రభావంతో భవిష్యత్తులో హిమా లయ ప్రాంతాలైన హిమాచల్ ప్రదేశ్, నేపాల్ వంటి పలు ప్రాంతాల్లో కూడా తీవ్రమైన భూకంప ప్రభావం ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ప్రభావం భారత ఈశాన్య రాష్ట్రాలతో పాటు ఉత్తర భారతదేశంపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని శాస్త్ర వేత్తలు చెబుతున్నారు. టెక్టోనిక్ ప్లేట్ల నిరంతరంవస్తున్న ఈ మార్పులు? టిబెట్‌తోపాటు భారత భూభాగాన్ని కూడా విడదీస్తూ చివరికి భూమి మధ్యలో ఉన్న మెంటెల్‌లో కలిపేస్తాయనే సిద్ధాంతం కూడాగట్టిగానే వినిపిస్తుంది.హిమాలయ ప్రాంతంలో భౌగోళికరాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ..భూమికింద ఉన్నటెక్టోనిక్ ప్లేట్లు మాత్రం తమ పని తాము చేసుకుపోతున్నాయి. ఏ ఖండాన్ని ఎటు చీల్చుతాయో తెలియకుండా కలవరం పుట్టిస్తున్నాయి.

# కరీంనగర్ లో ఎడిబుల్ కప్స్



కరీంనగర్: మనం కప్పులో టీ తాగుతాం. ఆ కప్పు ప్లాస్టిక్‌ది అయితే పడేస్తాం. స్టీల్ లేదా గ్లాస్ లేదా మట్టితో చేసింది అయితే.. కడిగి జాగ్రత్తగా దాచిపెట్టుకుంటాం. కానీ ఇప్పుడు తినే ఎడిబుల్ కప్స్ మార్కెట్లోకి వచ్చాయి. టీ తాగాక ఆ కప్‌ను తినేయవచ్చు. అలాంటి కప్పులు కరీంనగర్ జిల్లాలోనే తయారు చేస్తున్నారు.కరీంనగర్ జిల్లా మానకొండూర్ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం ఆధ్వర్యంలో.. అన్నారం గ్రామంలో ఎడిబుల్ టీ కప్స్ తయారీ కేంద్రాన్ని స్థాపించారు. ఇటీవల జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఓ సమావేశానికి సంఘం అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, డైరెక్టర్లు హాజరయ్యారు. అక్కడ ఎడిబుల్ కప్పులో టీ పోశారు. ఇవేవో బాగున్నాయనిపించి ఎక్కడ నుంచి తెప్పిస్తున్నారని అడిగారు.రాజమండ్రి నుంచి ఈ టీ కప్పులను సరఫరా చేసుకుంటున్నారని తెలుసుని.. వెయ్యి కప్పులకు ఆర్డర్ పెట్టారు. జిల్లాలోని ఆసుపత్రులు, బ్యాంకులు, సామాజిక వ్యక్తులు, పెద్ద పెద్ద హోటళ్ల నిర్వాహకులను కలిసి వాటిని చూపించారు. మంచి స్పందన రావడంతో.. సహకార సంఘం ఆధ్వర్యంలో అన్నారంలో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.మూలధనం రూ.3.75 లక్షలతో మిషన్‌ను, లక్ష రూపాయలతో తయారీ సామగ్రిని కొనుగోలు చేశారు. మూడు నెలల కిందట ఎడిబుల్ టీ కప్పుల తయారీ కేంద్రాన్ని ప్రారంబించారు. ఒక్క గ్లాసుకు 3.5 రూపాయలు ఖర్చవుతుండగా.. నాలుగు రూపాయలకు అమ్ముతున్నారు. కరీంనగర్, ఖమ్మం, కొత్తగూడెం, నాగర్ కర్నూల్, నల్లగొండ, సంగారెడ్డి, మహబూబ్ నగర్, పెద్దపల్లి జిల్లాల్లో హోటల్లో ఆర్డర్స్‌పై ఈ కప్పులను సరఫరా చేస్తున్నారు. ఇది రాష్ట్రంలోనే మొదటి ఎడిబుల్ కప్పుల తయారీ కేంద్రం కావడం విశేషం.కప్పులను చిరుధాన్యాలు రాగులు, మొక్కజొన్న పిండి, బియ్యంపిండి, మైదా పిండిలో తగినంత చక్కెరను కలిపి తయారు చేస్తుంటారు. రోజుకు వెయ్యి గ్లాసులను తయారు చేసేందుకు 40 కిలో పిండి అవసరముంటుంది. 10 గ్లాసులను ఒక్క ప్యాకెట్‌గా తయారు చేసి.. 40 రూపాయలకు విక్రయిస్తుంటారు. విద్యుత్ సరఫరా సక్రమంగా ఉంటే రోజుకు వెయ్యి గ్లాసులకు తయారు చేస్తారు.తయారు చేసిన గ్లాసులను ప్యాకింగ్ చేసి ఆర్డర్స్ పై సరఫరా చేస్తారు. ప్రస్తుతం ఒక్క గ్లాసుకు 50 పైసల లాభం వస్తోంది. మార్కెట్ పుంజుకుంటే అప్పుడు ధరను నిర్ణయిస్తామని నిర్వాహకులు తెలిపారు. గతంలో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటిలో స్టాల్స్ ఏర్పాటు చేస్తే మంచి స్పందన వచ్చింది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సమావేశం కాగా.. ఆయన సహకారం సంఘ పాలకవర్గాన్ని అభినందించి ప్రోత్సహించారు.ఈ కప్పులో టీ తాగడమే కాకుండా కప్పును తినవచ్చు. తినక పడేసినా అది తొందరగా భూమిలో కలిసిపోతుంది. పేపర్ గ్లాసులో టీ తాగడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. మిషన్‌లో పిండిని నింపేటప్పుడు దాని మీద పడ్డ పిండి.. గ్లాసు తయారు అయిన తర్వాత వేస్ట్ రూపంలో కిందపడుతుంది. దాన్ని ఆవులు, గేదలకు వేస్తే ఎంతో ఇష్టంగా తింటున్నాయని నిర్వాహకులు తెలిపారు.అన్నారం గ్రామంలో రైతు సహకారం సంఘం అధ్వర్యంలో మూడు నెలల కిందట టీ కప్పు తయారీ కేంద్రాన్ని నెలకొల్పామని.. త్వరగానే మార్కెట్ పుంజుకుందని రైతు సహకార సంఘం అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి చెబుతున్నారు. ప్రస్తుతం ఎనిమిది జిల్లాలకు సరఫరా చేస్తున్నామని.. ఇందులో టీ తాగడం ఆరోగ్యానికి మంచిదన్నారు. త్వరలో మొక్కజొన్న పిండి, గమ్ ఇస్తారాకుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వివరించారు.

# వైసీపీ టార్గెట్ పవన్..



విజయవాడ: తిరుపతిలో వైకుంఠ దర్శనం టోకెన్ల కోసం వచ్చి తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు చనిపోయిన ఘటన తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపుతోంది. అయితే ఘటన జరిగిన తర్వాత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, వైసీపీ అధినేత జగన్ తో పాటు పలువురు రాజకీయ నేతలు, మంత్రులు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించడంతో పాటు ఆస్పత్రులకు వెళ్లి బాధితుల్ని పరామర్శించారు. మిగతా వారి సంగతి ఎలా ఉన్నా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వేర్వేరుగా తిరుపతిలో పర్యటించడం చర్చనీయాంశమైంది. ఇక వైసీపీ నేతలు ఈ ఘటనకు సంబంధించి పవన్‌కళ్యాణ్‌ను టార్గెట్ చేస్తుండటం హాట్ టాపిక్‌గా మారింది.తిరుమల చరిత్రలోనే తీవ్ర విషాదం చోటు చేసుకుంది.. రద్దీ సమయాల్లో తొక్కిసలాటలు జరగడం సాధారణమే అయినప్పటికీ.. తొలిసారిగా, ఆ దశ దాటి భక్తుల మరణాలూ సంభవించాయి. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకోనున్న నేపథ్యంలో.. తిరుపతిలో ఏర్పాటు చేసిన టోకెన్ కౌంటర్లే మృత్యు వేదికలయ్యాయి. సామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు.. తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో ఏకంగా 90 టోకెన్ జారీ కౌంటర్లను ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి ఇలా గేట్లు తెరవగానే అలా భక్తులు ఒక్కసారిగా దూసుకురావడంతో? పలుచోట్ల తొక్కిసలాట జరిగింది.. బైరాగిపట్టెడ కేంద్రం వద్ద పరిస్థితి మరింత విషమించింది. రద్దీలో ఇరుక్కుపోయిన భక్తులు ఊపిరాడక అల్లాడిపోయారు. మహిళలు మరింత విలవిలలాడారు. ఈ విషాదంలో ఆరుగురు మరణించగా.. వారిలో ఐదుగురు మహిళలే. తొక్కిసలాటలో పెద్దసంఖ్యలో భక్తులు గాయపడ్డారు. వారికి తిరుపతిలోని స్విమ్స్, రుయా ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా తొక్కిసలాటల్లో గాయపడటం వంటి ఘటనలు జరిగినప్పటికీ.. మరణాలు సంభవించడం ఇదే మొదటిసారి అంటున్నారుఈ ఘటనపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించి నష్ట నివారణ చర్యలు చేపట్టారు. తొక్కిసలాట ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. డీఎస్పీ రమణ కుమార్ బాధ్యత లేకుండా పని చేశారని .. నిర్లక్ష్యంగా వ్యవహరించిన రమణ కుమార్, గోశాల డైరెక్టర్ హరనాథ్ రెడ్డిని సస్పెండ్ చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి, సీఎస్ వో శ్రీధర్ ను తక్షణమే బదిలీ చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగేఘటనపై న్యాయ విచారణ జరిపిస్తాం.టీటీడీ ద్వారా మరణించిన కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. మరణించిన కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగమిస్తామని.. తీవ్ర గాయాలైన తిమ్మక్క, ఈశ్వరమ్మలకు రూ.5 లక్షల చొప్పున, గాయపడిన ప్రతి ఒక్కరికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. బాధలో ఉన్నప్పటికి స్వామి వారి దర్శనం చేసుకోవాలనుకున్న భక్తులు 35 మందికి శుక్రవారం వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నష్ట పరిహారం, బాధ్యులపై చర్యలతో పాటు .. ప్రభుత్వం మీద పడిన నిందను తుడిచే ప్రయత్నం చేసినట్లు కనిపించారు. అదే సమయంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రభుత్వం ఈ ఘటనపై ఎంత ఆవేదన చెందుతుందో అన్నట్లు భావోద్వేగంతో మాట్లాడారు. జరిగిన విషాదంపై వేదనతో పాటు.. అధికారుల నిర్లక్ష్యం.. అలక్ష్యంతో పాటు.. ప్రణాళిక లోపాల్ని ఎత్తి చూపారుఅదే సమయంలో డిప్యూటీ సీఎం రాష్ట్ర ప్రభుత్వం తరఫున భక్తులందరికీ క్షమాపణలు చెప్పారు. తప్పు జరిగింది.. బాధ్యత తీసుకుంటామన్నారు. క్షతగాత్రులు, రాష్ట్ర ప్రజలు, వేంకటేశ్వరస్వామి భక్తులు, హైందవ ధర్మాన్ని నమ్మిన ప్రతి ఒక్కరినీ క్షమించమని రాష్ట్ర ప్రభుత్వం అడుగుతోందన్నారుఈ ఘటన జరగకుండా ఉండాల్సిందని, . పోలీసులు ఉండి కూడా ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. వీఐపీలపై కాదు.. సామాన్యులపైనా తితిదే దృష్టిపెట్టాలి. మృతుల కుటుంబాల వద్దకు టీటీడీ సభ్యులు వెళ్లి క్షమాపణలు చెప్పాలని ఆదేశించారు. తొక్కిసలాట ఘటనకు టీటీడీ ఈవో,ఏఈవో బాధ్యత తీసుకోవాలన్నారు.అధికారులు చేసిన తప్పులకు తాము తిట్లు తింటున్నామని.. తొక్కిసలాట జరిగితే సహాయక చర్యలు ఎలా ఉండాలన్న దానిపై ప్రణాళిక లేదని పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. వ్యక్తులు చేసిన తప్పులు రాష్ట్ర ప్రభుత్వంపై పడుతున్నాయని. భవిష్యత్తులో దుర్ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని.. పోలీసుల్లో కొందరు కావాలని చేశారా? అనే అనుమానాలు కూడా ఉన్నాయని. ఈ అనుమానాలన్నింటిపై విచారణ జరగాల్సి ఉందన్నారు. తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం 8–9 గంటలు ఎదురు చూసే పరిస్థితి మారాలని సాధ్యమైతే ఒకట్రెండు గంటల్లో దర్శనం జరిగేలా చూడాలని పవన్ కల్యాణ్ పేర్కొన్నారుసనాతన ధర్మాన్ని పాటిస్తూ.. దానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన పవన్ కళ్యాణ్ ఈ ఘటనపై స్పందించిన తీరు .. ఆ ధర్మానికి ఆయనెంత విలువిస్తారో మరో సారి స్పష్టం చేసింది. సీఎం, డిప్యూటీ సీఎంలు ఘటనకు సంబంధించి వెంటనే స్పందించినా విపక్షాలు మాత్రం విమర్శలు ఎక్కుపెడుతూనే ఉన్నాయి. హుటాహుటిన కొండ మీదకు చేరుకున్న మాజీ ముఖ్యమంత్రి జగన్ దీనికి చంద్రబాబే కారణమని విమర్శించారు. వాస్తవానికి తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టికెట్లు ఇవ్వటం గతంలో లేని సంప్రదాయం. వైకుంఠ ద్వార దర్శనాన్ని పది రోజులకు పెంచారు. ఎందుకు పెంచారో తెలియదని, మొదట్నుంచి ఉన్న సంప్రదాయాన్ని మార్చటం మంచిది కాదని..

ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ పద్ధతులు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వారిపాలక మండళ్లు ఈ నిర్ణయాలు తీసుకున్నాయి. ఇప్పుడు ఇప్పుడు తన మందీమార్భలంతో కొండ మీదకొచ్చిన జగన్ యథావిధిగా తనదైన శైలిలో స్పందించి వెళ్లి పోయారు.

## మూడు ఇండస్ట్రియల్ సిటీలు




తిరుపతి: కేంద్రంలోనూ ఎన్డీఏ సర్కారు ఉండటంతో.. కీలక ప్రాజెక్టులు దక్కుతున్నాయి. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లో మూడు ఇండస్ట్రియల్ సిటీలు ఏర్పాటు కానున్నాయి. దేశవ్యాప్తంగా 20 ఇండస్ట్రియల్ సిటీలను కేంద్రం ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మూడు ఏపీలోనే ఏర్పాటు కానుండటం విశేషం. తిరుపతి జిల్లాలో కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ ( క్రిస్ సిటీ) ఏర్పాటుకానుంది. చెన్నై – బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో క్రిస్ సిటీ ఏర్పాటు కానుంది. అలాగే కర్నూలు జిల్లాలో ఓర్వకల్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటవుతోంది. హైదరాబాద్ – బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. మరొకటి కడప జిల్లా కొప్పర్తిలో ఏర్పాటు కానుంది. విశాఖపట్నం – చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా కొప్పర్తి ఇండస్ట్రియల్ సిటీ నిర్మాణం జరగనుంది.వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్రం గ్రీన్ ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగానే రూ.2,786 కోట్ల వ్యయంతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ సిటీ, రూ.2,137 కోట్లతో కొప్పర్తి ఇండస్ట్రియల్ సిటీ ఏర్పాటు చేస్తున్నారు. కర్నూలు విమానాశ్రయానికి 12 కిలోమీటర్ల దూరంలో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ సిటీ నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో నాన్ మెటాలిక్ మినరల్స్, ఆటోమొబైల్స్, సెమీ కండక్టర్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫార్మాస్యూటికల్స్ రంగాలకు చెందిన పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. అలాగే కడప జిల్లా కొప్పర్తి ఇండస్ట్రియల్ సిటీ 2596 ఎకరాలలో అభివృద్ధి చేయనున్నారు. కొప్పర్తి ఇండస్ట్రియల్ సిటీ ద్వారా 54,500 మందికి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ సిటీ 45 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.మరోవైపు తిరుపతి జిల్లా క్రిస్ సిటీకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే శంకుస్థాపన చేశారు. కృష్ణపట్నం పోర్టు, చెన్నై–బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌ల ఆధారంగా క్రిస్ సిటీ ఏర్పాటవుతోంది. 10 వేల ఎకరాల్లో మూడు దశల్లో క్రిస్ సిటీ నిర్మాణం జరగనుంది. క్రిస్ సిటీ ద్వారా రూ.37,500 కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, 4.67లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలి దశ పనులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. తొలిదశ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 2139.43 కోట్లు. క్రిస్ సిటీ ప్రాజెక్టును 2027 ఫిబ్రవరికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# రాయలసీమలో ఫ్యాన్ గాలీ..



కర్నూలు, ,: రాయలసీమలో మళ్లీ ఫ్యాన్ గాలి వీస్తుంది. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో క్రమంగా వైసీపీ బలపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు అనేక నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి ఉంది. కూటమి సర్కార్ సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయకపోవడంతో పాటు సీమ ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదన్న భావన ఆ ప్రాంత ప్రజల్లో బలపడుతున్నట్లు అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. దీనికి తోడు కూటమి నేతల మధ్య అనైక్యత కూడా వైసీపీ బలం పుంజుకోవడానికి కారణంగా చెబుతున్నారు. అభివృద్ధి విషయాన్ని పక్కన పెడితే వైసీపీకి, కూటమి ప్రభుత్వానికి పెద్దగా తేడా ఏమీ లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. అయితే వెల్ ఫేర్ స్కీమ్ అమలులో మాత్రం కూటమి సర్కార్ వెనుకంజలోనే ఉంది. . గత ఎన్నికల్లో కర్నూలు జిల్లాలో 14 సీట్లు ఉండగా కూటమి పార్టీలకు పన్నెండు స్థానాలు, వైసీపీకి కేవలం రెండు స్థానాలు మాత్రమే లభించాయి. అలాగే అనంతపురం జిల్లాలోని పథ్నాలుగు నియోజకవర్గాలకు గాను పథ్నాలుగు స్థానాల్లోనూ కూటమి పార్టీలు విజయం సాధించాయి. వైసీపీకి జీరో స్థానాలు దక్కాయి. కడప నియోజకవర్గంలో ఉన్న పది స్థానాల్లో కూటమికి ఏడు, వైసీపీకి మూడు స్థానాలు దక్కాయి. చిత్తూరు జిల్లాలో పథ్నాలుగు స్థానాలకు పన్నెండు నియోజకవర్గాల్లో కూటమి, రెండు స్థానాల్లో వైసీపీ విజయం సాధించింది. అయితే ఇప్పుడు కూటమి పార్టీల నేతల మధ్య ఈ జిల్లాల్లో ఎక్కడా సమన్వయం లేదు. ఒకరిపై ఒకరు పైచేయి సాధించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రాయలసీమలోని యాభై రెండు నియోజకవర్గాల్లో ఏడు స్థానాలను మాత్రమే వైసీపీ దక్కించుకుంది. మిగిలనవన్నీ కూటమి గెలుచుకుంది. అనంతపురం, కర్నూలు జిల్లాలో కూటమి నేతల మధ్య విభేదాలు బాహాటంగానే కనపడుతుండటంతో క్యాడర్ లో అయోమయం నెలకొంది. మరొక వైపు మంత్రి వర్గంలో పదవులు లభించలేదని సీనియర్ నేతలు సయితం పెద్దగా పట్టించుకోవడం లేదు. అనేక నియోజకవర్గాల్లో కూటమి నేతలు నియోజకవర్గంపై పట్టు సాదించుకునేందుకు ఒకరిపై ఒకరు ఆధిపత్యం ప్రదర్శించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదోని, మంత్రాలయం, నందికొట్కూరు, నంద్యాల, అనంతపురం, పుట్టపర్తి, కల్యాణదుర్గం, ప్రొద్దుటూరు వంటి నియోజకవర్గాల్లో కూటమి పార్టీ నేతలు ఒకరికొకరు దూషించుకుని, తమ గ్రూపును కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో కూటమి పార్టీలు బలహీనమయ్యాయన్న టాక్ బలంగా వినపడుతుంది. మరొకవైపు తాడిపత్రి నియోజకవర్గంలో జరుగుతున్న ఘటనలు కూడా సీమపై ప్రభావం చూపుతున్నాయి. ఒకరంటే ఒకరికి పొసగడం లేదు. అధినాయకత్వం కూడా కూటమి నేతల మధ్య రాజీ కుదర్చలేని పరిస్థితుల్లో ఉంది.

ఇసుక పాలసీ, మద్యం పాలసీని ఎవరికి వారు సొమ్ము చేసుకునే ప్రయత్నంలో భాగంగా తమ అనుచరులకు కట్టబెట్టాలన్న ప్రయత్నంలో విభేదాలు తలెత్తుతున్నాయని తెలిసింది. ఈ నేపథ్యంలోనే కూటమి నేతలు ఇచ్చిన అవకాశాలే వైసీపీ తన విజయావకాశాలుగా మలచుకునే ఛాన్స్ కనపడుతుంది. మరొక వైపు ఈ నెల మూడో వారంనుంచి జగన్ రాష్ట్ర వ్యాప్త పర్యటనచేస్తుండటం కూడా వైసీపీకి రాయలసీమ లో కొంత సానుకూల వాతావరణం ఏర్పడే అవకాశముందన్నది విశ్లేషకుల అంచనా. మరి కూటమి నేతలు ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను తెలుసుకుని సరిదిద్దుకోగలిగితే కొంత తేరుకునే అవకాశాలు లేకపోలేదు.

## సీలింగ్ విధిస్తారా..? లేదా..?

ఖమ్మం: తెలంగాణలో రైతు భరోసా స్కీమ్ పట్టాలెక్కనుంది. ఈ మేరకు తెలంగాణ సర్కార్ ఇటీవలనే కీలక నిర్ణయాలు కూడా తీసుకుంది. స్కీమ్ అమలుకు సంబంధించి మంత్రివర్గం కూడా ఆమోదముద్ర వేసింది. వ తేదీ నుంచి ఈ స్కీమ్ ను అమలు చేయాలని నిర్ణయించింది. ఏటా రూ. 12వేల పంట పెట్టుబడి సాయం అందించబోతుంది.రైతు భరోసా స్కీమ్ ను అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్న సంగతి తెలిసిందే. అయితే పథకం అమలులో సర్కార్ ఎలాంటి చర్యలు తీసుకోబోతుందనేది ఆసక్తికరంగా మారింది. గతంలో ఉన్న రైతుబంధు పథకం అమలులో అనేక లోపాలు ఉన్నాయని.. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతూ వస్తోంది. గతంలో మాదిరిగా స్కీమ్ అమలు ఉండదని? సాగు యోగ్యత ఉన్న భూములకే రైతు భరోసా ఇస్తామని కూడా క్లారిటీ ఇచ్చింది.స్కీమ్ అమలుపై ప్రాథమికంగా కొన్ని సందేహాలు తెరపైకి వస్తున్నాయి. ఇందులో సీలింగ్ అంశం కూడా ఒకటిగా ఉంది. గతంలో అమలు చేసిన రైతుబంధు పథకంకింద ఒక రైతుకు ఎన్ని ఎకరాలు ఉన్నా.. పంట పెట్టుబడి సాయం అందించారు. ఎలాంటి సీలింగ్ ను కూడా నిర్ణయించలేదు. దీంతో రైతుకు ఎంత విస్తీరణంలో భూమి ఉందో.. అంతమేరకు పంట సాయం అందింది. అయితే దీనిపై అనేక వర్గాల నుంచి పలు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుతం అమలు చేయబోతే రైతు భరోసా పథకంలో సీలింగ్ ఉంటుందా..? ఉండదా..? అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. నిజానికి కేబినెట్ సబ్ కమిటీ.. జిల్లా వారీగా రైతుల నుంచి అభిప్రాయాలను కూడా సేకరించింది. అసెంబ్లీలో నిర్వహించిన చర్చలో కూడాపలు సూచనలు, సలహాలు వచ్చాయి. అయితే ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలిసింది.కేబినెట్ భేటీ ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలను వెల్లడించారు.

# మాజీ ఎమ్మెల్యే తెచ్చిన నిధులతోనే నర్సంపేట పట్టణ అభివృద్ధి



నర్సంపేట: నర్సంపేట పట్టణాభివృద్ధి మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి తెచ్చిన నిధులతోనే నర్సంపేట అభివృద్ధి జరిగిందని బి.ఆర్.ఎస్ మాజీ రాష్ట్ర రైతు సమన్వయ సమితి డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి అన్నారు. పట్టణ అధ్యక్షులు నాగెల్లి వెంకట్ నారాయణ అధ్యక్షతన పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు టఫ్ అండ్ కో నిధుల నుండి 40 కోట్ల రూపాయలు తీసుకొచ్చారని, ఆ నిధులతో పట్టణంలో నూతన సైడ్ డ్రైనేజీ నిర్మాణం సీ సీ రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు.రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా నర్సంపేటకు మెడికల్ కళాశాల, జిల్లా ఆస్పత్రి నిర్మాణం చేపట్టి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశాడని కొనియాడారు.పాకాల, రంగయ్య చెరువులకు గోదావరి నీళ్లు తీసుకువచ్చి నర్సంపేట నియోజకవర్గంలో గొలుసుకట్టు చెరువులుగా ఉగాది రోజు మత్తలు పడుతున్నాయంటే అవి పెద్ది చేసిన కృషి వల్లేనని అన్నారు.సంవత్సరంలో రెండు పంటలు పండుతున్నాయని గుర్తు చేశారు....మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ... టఫ్ అండ్ కో నిధులు నుండి అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, పక్షపాత ధోరణితో కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యవహరిస్తూ, పట్టణంలో కొన్ని వాటిలో మాత్రమే పనులు చేపిస్తున్నారని విమర్శించారు.ఒకటవ వార్డు నుండి తొమ్మిదవ వార్డు కేటాయించిన సుమారు 16 కోట్ల విలువ గల పనులను రద్దుచేసి తన సొంత ఎజెండా వ్యక్తిగత స్వార్థం కోసం అట్టి పనులను డైవర్ట్ చేయడం సరికాదని, దీన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బి. ఆర్. టీ. యూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, క్లస్టర్ బాధ్యులు బండి రమేష్ ,బి. ఆర్. ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి వెన్నుముద్దుల శ్రీధర్ రెడ్డి, కౌన్సిలర్లు రుద్ర మల్లీశ్వరి ఓం ప్రకాష్ ,నాగిశెట్టి పద్మ ప్రసాద్, ఎండి పాషా రాయిడు కీర్తి దుష్యంత్ రెడ్డి ,గందె పద్మా చంద్రమౌళి దేవుజు తిరుమల సదానందం, రామ సాయం శ్రీదేవి,సుధాకర్ రెడ్డి ,బాణాల ఇందిర రాంబాబు,పట్టణ మహిళా అధ్యక్షురాలు వాసం కరుణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఇర్ఫాన్, వార్డ్ అధ్యక్షులు బాబు, నాగిరెడ్డి, సాలన్న, దుగ్యాల రాజు దొంగల సురేష్ పెరమండ్ల ప్రభాకర్ రెడ్డి,కోటి, ఆబోతు రాజు యాదవ్ ,నాయిని వేణు,నరేందర్ రచ్చ రఘు, సాంబయ్య ,రాయరాకుల సారంగం, పెండ్యాల యాదగిరి, పెరమండ్ల రవి, బండి ప్రవీణ్, మేడిద శ్రీనివాస్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పథకాలపై ఫీల్డ్ సర్వే..

నిజామాబాద్, , : తెలంగాణ ప్రభుత్వం మరో నాలుగు కొత్త పథకాలు ప్రారంభించేందుకు సిద్ధమైంది. నుంచి రైతు భరోసా పంట పెట్టుబడి సాయం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో వీటికి సంబంధించి లబ్ధిదారుల జాబితా తయారీకి ప్రభుత్వం నేటి నుంచి ఫీల్డ్ సర్వే చేపట్టనుంది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ఈ నెల 21నుంచి 24 వరకు గ్రామసభలు, డేటా ఎంట్రీ చేయనున్నారుఈ డేటా ఆధారంగా 25న తుది జాబితాకు మంత్రులు ఆమోదం తెలపనున్నారు. అనంతరం రిపబ్లిక్ డే న పథకాలను సీఎం రేవంత్ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు అధికారులు కీలక సూచనలు ఇచ్చారు. వెరిఫికేషన్‌లో భాగంగా అధికారులు ఇండ్లకు సర్వే కోసం వస్తారని.. గ్రామ ప్రజలు అందుబాటులో ఉండాలని సూచిస్తున్నారు. (

గామ కార్యదర్శి ద్వారా ప్రజలకు ఇప్పటికే సమాచారం తెలియజేశారు. నేటి నుంచి ఈనెల 20 వరకు వెరిఫికేషన్ ఉంటుందని చెప్పారు.రైతు భరోసా పథకం కింద రైతులకు పంట పెట్టుబడి సాయం అందించనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరుతో ఎకరాకు రూ.10 వేలు జమ చేయగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ. 12 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. అందుకు సంబంధించిన కసరత్తు, విధివిధానాల రూపకల్పన జరుగుతోంది. సాగులో ఉన్న ప్రతి ఎకరాకు రైతు భరోసా పంట పెట్టుబడి సాయం అందిస్తామని సీఎం రేవంత్ ఇప్పటికే ప్రకటించారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద రాష్ట్రంలో భూమిలేని నిరుపేద రైతు కూలీలకు ఆర్థిక సాయం అందించనున్నారు. ఒక్క కుటుంబానికి ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం చేయనుండగా.. ఉపాధి హామీ పథకంలో చేసిన పని ఆధారంగా అర్హులను గుర్తించేందుకు కసరత్తు చేస్తున్నారు. న తొలి విడతగా రైతు కూలీల అకౌంట్లలో రూ.6 వేలు జమ చేయనున్నట్లు తెలిసింది. ఇక ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా రాష్ట్రంలో ఇండ్లు లేని పేదలకు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేయనున్నారు. మె?త్తం నాలుగు విడతల్లో రూ.5 లక్షల సాయం అందిచనునన్నారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇండ్లను కేటాయించను న్నారు. తొలి దశలో నిరుపేదలకు అవకాశం ఇస్తామని సర్కార్ ప్రకటించింది. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయక చాలా ఏళ్లు గడుస్తున్న నేపథ్యంలో అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. దాదాపు 30 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.

# ఆర్థికం.. మందగమనం



భారత ఆర్థిక వ్యవస్థలో మందగమనం ఛాయలు కొట్టచ్చినట్లు కనబడుతున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక వేగంగా వృద్ధి చెందుతోన్నామని బిజెపి పాలక వర్గాల ప్రచారానికి.. వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా పోయింది. దేశంలోని పట్టణ ప్రజల్లో వినియమం తగ్గడం, కార్పొరేట్ల ఆదాయాల్లోనూ పతనం చోటు చేసుకుంటుంది. అధిక వడ్డీ రేట్లు, హెచ్చు పన్నులకు తోడు కుటుంబ రుణ భారాలు పెరిగిపోతూ.. వ్యక్తిగత రుణాలు చెల్లించలేని పరిస్థితులు పెరుగుతున్నాయి. వెరసీ ఈ ప్రభావం కార్పొరేట్ కంపెనీల అమ్మకాలపై పడుతోంది. దీంతో ఇటీవల సెప్టెంబర్ త్రైమాసికంలో అనేక కంపెనీలఆదాయాలు భారీగాపడిపోయాయి.మరోవైపుదలాల్ స్ట్రీట్ అమ్మకాల ఒత్తిడితో బెంబెలెత్తుతోంది. స్టాక్ మార్కెట్లలో పండుగ వాతావరణం ఆవిరై మదుపర్లుభారీ నష్టాలనుఎదుర్కొంటున్నారు.ఈ పరిణామాలన్నీ మాంద్యానికి సంకేతాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**మధ్యతరగతి కొన లేరు..:** ఆదాయాలు తగ్గడంతో పట్టణ వినిమయం భారీగా పడిపోతోంది. ముఖ్యంగా అధిక వడ్డీ రేట్లు, హెచ్చు ద్రవ్యోల్బణంతో చిన్న మొత్తాల రుణాలు పొందిన వారు తిరిగి సకాలంలో చెల్లించలేకపోతున్నారు. ఉద్యోగులు, కార్మికుల వేతనాల్లోనూ పెంపుదల అంతంత మాత్రమే ఉంటుంది. సెప్టెంబర్ త్రైమాసికంలో విత్తయేతర కార్పొరేట్ కంపెనీలు తమ సిబ్బంది వేతన వ్యయాలను 0.8 శాతమే పెంచాయి. ఇంతక్రితం జూన్ త్రైమాసికంలో 1.2 శాతం పెంపుదల ఉంది. దీని ప్రభావాలు ఇప్పుడు అన్ని రంగాలపై కనబడుతోందని నెస్లే ఇండియా సిఇఒ సురేష్ నారాయణన్ పేర్కొన్నారు. ప్రీమియం వినియోగం బలంగానే ఉన్నప్పటికీ.. మధ్యస్థ విభాగంలో ఒత్తిడి నెలకొందన్నారు. గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో తమ అమ్మకాల్లో కేవలం 1.4 శాతం పెరుగుదలమాత్రమే ఉందన్నారు.గత రెండేళ్లలో ఇదే అత్యల్ప వృద్ధి రేటు అన్నారు.పండగ సీజన్‌లో స్పోర్ట్స్‌యుటిలిటీ వెహికల్ (ఎస్‌యు వి) విభాగంలో అమ్మకాలు పడిపోయి 7లక్షల కార్లు నిల్వ ఉండిపోయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మైక్రోఫైనాన్స్ రుణాల జారీలోనూ పతనం పెరిగింది. ఈ పరిణామాలు మధ్యతరగతి ప్రజల్లో ఆదాయాల పతనాన్ని, మందగమనాన్ని స్పష్టం చేస్తున్నాయి.

**జిడిపి డౌన్..:** ప్రపంచంలోనే వేగంగా పెరుగుతోన్న ఆర్థిక వ్యవస్థగా చెప్పుకుంటున్న భారత్‌లో అన్ని రంగాల కంపెనీల్లో మందగమనం వైరస్ క్రమంగా పుంజుకుంటుంది. బజాజ్ ఆటో, మారుతి సుజుకి, హిందుస్తాన్ యూనిలీవర్, నెస్లే తదితరసహా చిన్న బ్యాంక్‌లు, ఎన్‌బిఎఫ్‌సిలు ఆదాయాలను కోల్పోతున్నాయి. ఆర్థిక సంవత్సరం 2023-24లో 8.2 శాతం వృద్ధిని నమోదు చేసిన భారత్ ప్రస్తుత 2024-25 తొలి త్రైమాసికంలో జిడిపి 6.7 శాతానికి పరిమితమ య్యింది. రెండో త్రైమాసికంలో వృద్ధి రేటు అంచనాలను 7.2 శాతం నుంచి 7 శాతానికి తగ్గిస్తూ ఆర్‌బిఐ అంచనా వేసింది. 2024-25లో 7.2 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. భారత వృద్ధి 6.5 శాతానికి పరిమితం కావొచ్చని గోల్డ్‌మాన్ సాచే అంచనా వేసింది.

**వాహన అమ్మకాలు డీలా..:** ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులకు ప్రధాన గీటురాయిగా చూసే వాహన అమ్మకాల్లోనూ పతనం చోటు చేసుకుంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ అక్టోబర్ 28న వెల్లడించిన రిపోర్ట్ ప్రకారం.. ఎఫ్‌ఎడిఎ గణంకాలను ఉదహరిస్తూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థంలో వాహన అమ్మకాలు 2.3 శాతం తగ్గాయని వెల్లడించింది. రెండో త్రైమాసికంలో పట్టణ అమ్మకాల్లో తగ్గుదలనే ప్రధాన కారణమని పేర్కొంది. మరోవైపు ఎఫ్‌ఎంసిజి అమ్మకాల పెరుగుదల 2.8 శాతానికి క్షీణించాయి. ఈ రంగం గతేడాది ఇదే త్రైమాసికంలో 10.1 శాతం వృద్ధిని సాధించింది.

**దలాల్ స్ట్రీట్‌లోనూ నిరాశలు..:**

గడిచిన నెల రోజులుగా దలాల్ స్ట్రీట్‌పై బేర్ పంజా కొనసాగుతోంది. అమ్మకాల ఒత్తిడితో రిటైల్ ఇన్వెస్టర్లు భారీ నష్టాలను చవి చూస్తున్నారు. భారత మార్కెట్ నుండి భారీగా ఎఫ్ఐఐలు తరలిపోవడమూ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లకు నిదర్శనం.

**పడిపోతున్న పట్టణ వినిమయం**
**పెరుగుతున్న కుటుంబ రుణ భారాలు**
**హెచ్చు వడ్డీ రేట్లతో ఒత్తిడి**
**స్టాక్ మార్కెట్ల కుదేలు..**

బెర్న్‌స్టెయిన్ ఇండియా స్ట్రాటజీ రిపోర్ట్ ప్రకారం.. "నిఫ్టీ 100లోని కంపెనీలు దాదాపు 48 శాతం తమ అంచనాలను కోల్పోయాయి. ఇది మార్చి 2020 తర్వాత అత్యధికం. ఇప్పుడు మార్కెట్లలో ఉత్సాహం (పార్టీ) ముగుస్తోంది. నిఫ్టీ 50 ఆల్‌టైం గరిష్టాల నుంచి 10 శాతం పతనమయ్యింది. ఇది మొత్తం ఆర్థిక వ్యవస్థతో ఏమి జరుగుతుందో అర్థం చేసుకోవడానికి ఓ కారణం. భారత్‌లోని హెచ్చు ద్రవ్యోల్బణం, తక్కువ వేతనాల పెరుగుదల మార్కెట్లపైనా ప్రతిబింబిస్తుంది. గతంలో ఏడాదికి 30 శాతం రాబడిని అందుకున్న ఇన్వెస్టర్లు వచ్చే ఏడాది ఒక్క అంకె స్థాయిలోనే రాబడి పొందే అవకాశం ఉంది." అని బెర్న్‌స్టెయిన్ రిపోర్ట్ పేర్కొంది.

**రెండంకెల్లో షేర్ల పతనం:** ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న బలహీనతల నేపథ్యంలో దలాల్ స్ట్రీట్‌లో దిగ్గజ కంపెనీల షేర్లు బేర్‌మంటున్నాయి. నిఫ్టీ50లో ఆల్‌టైం గరిష్టాలను చవి చూసిన స్టాక్స్ నేల చూపులు చూస్తున్నాయి. కొన్ని స్టాక్స్ అథోపాతాలానికి పడిపోతున్నాయి. దీంతో వీటిల్లో పెట్టుబడులు పెట్టిన సగటు రిటైల్ ఇన్వెస్టర్లు తీవ్ర ఆందోళనకు గురైతున్నారు. కొత్త పెట్టుబడులు పడిపోతున్నాయి. నవంబర్ 4 నాటి మార్కెట్ వివరాల ప్రకారం పరిశీలిస్తే అనేక కంపెనీల షేర్లు రెండంకెల స్థాయిలో క్షీణించాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్ ఈ ఏడాది ఆల్‌టైం గరిష్ట స్థాయి రూ.3,435 వద్ద నమోదు కాగా.. 16 శాతం పతనమై రూ.2,897కు పడిపోయింది. ఆసియన్ పేయింట్స్ స్టాక్ 15 శాతం విలువ కోల్పోయి రూ.2,915 వద్ద నమోదయ్యింది. ఇండుస్‌ఇండ్ బ్యాంక్ ఏకంగా 37 శాతం, మారుతి సుజుకి 19 శాతం, హీరో మోటో కార్ప్ 23 శాతం, టాటా మోటార్స్ 30 శాతం, యాక్సిస్ బ్యాంక్ 15 శాతం, హిందుస్థాన్ యూనిలీవర్ 17 శాతం, కొటాక్ మహీంద్రా బ్యాంక్ 11శాతం, నెస్లే ఇండియా 19 శాతం, టిసిఎస్ 14 శాతం చొప్పున నష్టపోయాయి.

**డిమాండ్ లేమి..:**

గడిచిన రెండున్నరేళ్లలో ఆర్‌బిఐ ఒక్క సారికూడా వడ్డీ రేట్లను తగ్గించలేదు. అంతక్రితం వరుసగా 2.50 శాతం మేర పెంచి రెపోరేటును 6.50 శాతానికి చేర్చింది. దీంతో రుణ గ్రహీతలపై తీవ్ర భారం పడుతోంది. మరోవైపు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్ట్ కాలంలో భారత సరుకుల ఎగుమతుల్లో కేవలం 1.1 శాతం పెరుగుదల మాత్రమే ఉంది. ఇది ఉద్యోగాల కల్పనకు ఏమాత్రం సరిపోదు.

గడిచిన రెండు త్రైమాసికాల్లో డిమాండ్ లేమితో సిమెంట్, ఇనుము, ఉక్కు, రసాయనాల లాంటి ప్రధాన రంగాలు ప్రతికూల వృద్ధిని చవి చూడటంఆందోళనకరం. తయారీ రంగంలోనూ డిమాండ్ సన్నగల్లింది. ఏడాదిక్రితంతో పోల్చితే వినియోగదారుల్లో విశ్వాసం సన్నగిల్లిందని అనేకసర్వేలు చెబుతున్నాయి. ఈ పరిణామాలు ఆర్థిక వ్యవస్థలో తీవ్ర ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయని స్పష్టమవుతోంది.

## పదవుల భర్తీలో ఆలస్యంతో నైరాశ్యం

హైదరాబాద్, : పదేళ్లు పోరాడం. పొద్దున లేస్తే రోడ్డు మీదే ఉన్నాం. ఇప్పుడు పార్టీ పవర్‌లోకి వచ్చింది న్యాయం జరుగుతుందని అనుకున్నాం. ఏడాది అవుతుంది. ఇప్పటివరకు ఓ గుర్తింపు లేదు. పదవి లేదు. అంటూ గునుక్కుంటున్నారట కాంగ్రెస్ నేతలు. ఇంకో నెల అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్నా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో క్యాబినెట్ విస్తరణ జరగలేదు. కార్పొరేషన్ ఛైర్మన్ పదవులను కూడా మొత్తం భర్తీ చేయలేదు. ఇలా పదవుల భర్తీలో ఆలస్యం అవుతుండటంతో నేతల్లో నైరాశ్యం కనిపిస్తోందట. పార్టీ కోసం ఎంత మొత్తుకుని ఏం లాభం అంటూ నింటూర్పుతో ఉన్నారు కొందరు నేతలు.రోజులు గడుస్తున్నా పదవుల భర్తీకి సర్కారు పెద్దలు పచ్చజెండా ఊపకపోవడంతో లీడర్లు ఢీలా పడుతున్నారు. పూర్తిస్థాయి క్యాబినెట్ విస్తరణపై చాలాసార్లు కసరత్తు చేసినా..ముందడుగు పడటం లేదు. సీఎంతో సహా 11మంది మంత్రులతోనే ఇప్పుడు ప్రభుత్వం నడుస్తోంది. మిగతా ఆరు బెర్తుల కోసం తక్కువలో తక్కువ 20మంది ఎమ్మెల్యేలు పోటీ పడుతున్నారు. అందుకోసం సీఎం రేవంత్‌తో పాటు ఢిల్లీ స్థాయిలో కూడా పైరవీలు చేస్తున్నారట. అయితే అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకపోవడంతో మంత్రివర్గ విస్తరణ జరగడం లేదు. నేతల అమాత్య ఆశలు నెరవేరడం లేదు. క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న ఆరు బెర్తులను భర్తీ చేయడానికి చాలా సమస్యలు ఉన్నాయంటున్నారు. ఉమ్మడి జిల్లాల వారిగా ప్రాతినిధ్యంతో పాటు సామాజిక సమీకరణాలను కూడా బేరీజు వేసుకుంటున్నారు. ఇవేవీ కొలిక్కి రాకపోవడంతో పార్టీ అధిష్టానం వాయిదా వేస్తూ వస్తోందిఇక కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల భర్తీది అదే పరిస్థితి. పార్లమెంట్ ఎన్నికల ముందు ప్రకటించి ఆ తర్వాత మూడు నెలలకు గానీ జీవోలు ఇవ్వలేదు. ఇప్పటికీ ఇంకా 40 శాతం ఛైర్మన్ పోస్ట్‌లు ఖాళీగా ఉన్నాయి. అవి ఎప్పుడు భర్తీ చేస్తారా అని నేతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.ఇప్పటికే ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో..కార్పొరేషన్ ఛైర్మన్ పదవి అయినా ఇస్తారా లేకపోతే తమ సంగతి ఇంతేనా అని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట నేతలు. కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కోసం చాలామంది నేతలు గాంధీభవన్‌తో పాటు సీఎం, మంత్రుల చుట్టూ తిరుగుతున్నారుఎవరి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో నేతలంతా నీరసించి పోతున్నారు. కార్పొరేషన్ ఛైర్మన్లకు క్యాబినెట్ విస్తరణకు ముడిపడి ఉండటంతో.. వ్యవహారం కొలిక్కి రావడం లేదు. ఇక వ్యవసాయ మార్కెట్ కమిటీలది అదే పరిస్థితి. ఇప్పటివరకు సగం మార్కెట్లకే కమిటీలు వేశారు. మిగతావి అన్ని పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇలా ఇంకా చాలా పోస్ట్‌ల భర్తీని పెండింగ్‌లోనే ఉంచారు ప్రభుత్వ పెద్దలు. పదవులు భర్తీ చేయకపోవడంతో పార్టీ కోసం పనిచేసిన నేతలు..సీట్లు త్యాగం చేసినవారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.రోజులు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన తమకు మొండి చెయ్యి చూపిస్తున్నారని పార్టీ నేతలతో పాటు, ద్వితీయ శ్రేణి లీడర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వచ్చి ఇన్ని నెలలు అవుతున్నా పదవుల భర్తీకి ఆలస్యం ఎందుకు అవుతుందో కనీసం సీనియర్లు అయినా క్లారిటీ ఇవ్వాలంటున్నారు. ఇలాఅయితే పార్టీ కోసం పనిచేయడం ఎలా అని ప్రశ్నిస్తున్నారట. త్వరలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు,మున్సిపల్ ఎన్నికల కోసం పనిచేయాలంటే పదవులు ఇవ్వాలంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు కూడా పదవి లేకుండా పని చేయమనడం ఎంతవరకు సాధ్యం అవుతుందని పీసీసీ పెద్దలను నిలదీస్తున్నారట పార్టీ నేతలు.

# చేయూత నిలిపివేత..

**బీఆర్ఎస్ తీసుకొచ్చిన పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం!**

**ఆర్థిక ఇబ్బందుల్లో చేనేత కార్మికులు**

హైదరాబాద్: చేనేత కార్మికుల ఆర్థిక స్వాలంబన కోసం గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో పరితపించారు. వారి కోసం 'చేనేతకు చే యూత' పేరుతో అద్భుతమైన పథకాన్ని తీసుకొచ్చారు. ఈ పథకం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపారు. కానీ,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని నీరుగార్చింది. స్కీమ్‌ను నిలిపివేసి నేతన్నల కడుపుకొట్టింది. వారిని ఆర్థిక సమస్యల ఊబిలో పడేసింది. ఫలితంగా మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి.

**గడువు ముగిసినా తిరిగి ప్రారంభించలే..:**

గత 36 నెలలుగా దిగ్విజయంగా కొనసాగిన చేయూత పథకం గడువు ముగిసినా.. ఇంత వరకు ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ప్రారంభించలేదు. అదేమని అడిగిన నేత కార్మిక సంఘాల నాయకులకు చేదు అనుభవమే మిగిలింది. తప్పని పరిస్థితుల్లో నిరసన కార్యక్రమాలకు దిగిన నేతన్నలపై కాంగ్రెస్ సర్కారు కత్తి కడుతోంది. కనీసం ఈ పథకాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారన్న డిమాండ్‌కు ప్రభుత్వంలో చలనం కూడా లేకుండా పోయిందనే అభిప్రాయాలను నేత కార్మికులు వ్యక్తం చేస్తున్నారు. చేయూత పథకాన్ని కొనసాగించాలని, తమ బతుకులను బాగుచేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసినా.. ఫలితం లేదని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కూరపాటి రమేశ్ ఆవేదన వ్యక్తంచేశారు.

**అర్ధాంతరంగా నిలిపివేత..:** వాస్తవానికి 'చేనేత చేయూత' పథకం అద్భుతమైంది. ఓనేత కార్మికుడు ప్రతి నెలా బ్యాంకులో రూ.1000 జమ చేస్తే.. దానికి ప్రభుత్వం రూ.2000 కలిపి మొత్తాన్ని తిరిగి నేత కార్మికుడి ఖాతాలో జమ చేయడం ఈ పథకం ఉద్దేశం. ఈ పథకంతో ఆర్థికంగా చితికిపోయిన నేతన్నలకు ఆర్థిక పరిపుష్టి లభించింది. వారి ఆనందం ఎంతోకాలం నిలువలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వారి బతుకులను ఆగం చేసింది. చేయూత పథకాన్ని అర్ధాంతరంగా నిలిపివేసింది. దీంతో నేత కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పథకం కింద నేత కార్మికులు గత 36 నెలలపాటు రూ.1000 చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 26 వేల మంది నేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.80 కోట్లను కేటాయించి తిరిగి రెన్యువల్ చేయాల్సి ఉండగా, ప్రభుత్వం ఇప్పటి వరకు వాటి ఊసే ఎత్తకపోవడం గమనార్హం.



# ఈ చట్నీతో కీళ్ల నొప్పులకు చెక్ పెట్టొచ్చు..



చలికాలం వచ్చేసరికి ఒంటి నొప్పులు పెరుగుతాయి. చలి కారణంగా ఎముకలు గట్టిపడటంతో ఇలా జరుగుతుంది. వృద్ధుల్లో సమస్య ఇంకా ఎక్కువగా ఉంటుంది. కీళ్లనొప్పులు, యూరిక్ యాసిడ్ నొప్పులు వేధిస్తాయి. ముఖ్యంగా యూరిక్ యాసిడ్ పేషెంట్‌లకు చలికాలం రాగానే సమస్యలు ఎక్కువవుతాయి. మూత్రపిండాలు సరిగ్గా పని చేయనప్పుడు యూరిక్ యాసిడ్ పెరుగుతుంది. పోషకాహార లోపం, వ్యాయామం లేకపోవడంవల్ల కూడా కీళ్లలో యూరిక్ యాసిడ్ పేరుకుపోతుంది. అయితే ఉసిరి చట్నీతో యూరిక్ యాసిడ్ సమస్యకు చెక్ పెట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు. శీతాకాలంలోఉసిరికాయ సీజన్ ఉంటుంది. ఈ సీజన్‌లో యూరిక్ యాసిడ్ రోగులు ఉసిరి చట్నీ ఎక్కువగా తినాలి. విటమిన్ సి పుష్కలంగా ఉండే ఉసిరికాయ ఎలివేటెడ్ యూరిక్ యాసిడ్‌ను తగ్గిస్తుంది. ఉసిరిలో యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఇది కూడా అధిక యూరిక్ యాసిడ్‌ను తద్వారా కీళ్ల నొప్పులను తగ్గిస్తుంది. కీళ్ల నొప్పులు, గౌట్‌తో బాధపడుతున్న రోగులకు ఉసిరి చాలా మంచిది.

ఉసిరి చట్నీ తయారీ ఎలా..?: ఉసిరి చట్నీ చేయడానికి రెండు లేదా మూడు తాజా ఉసిరికాయలను తీసుకుని కోయాలి. ఇప్పుడు ఉసిరికాయ ముక్కలను మిక్సీలో వేయాలి.

అందులో కొత్తిమీర తరుగు, పచ్చిమిర్చి, జీలకర్ర, ఉప్పు వేసి కలుపాలి. కావాలంటే ఒక స్పూన్ తెల్ల నువ్వులను కూడా జోడించవచ్చు. ఇప్పుడు చట్నీని మిక్సీలో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఈ చట్నీని రోజూ ఆహారంతోపాటు తీసుకుంటే యూరిక్ యాసిడ్ సమస్య నుంచి ఉపశమనం కలుగుతుంది.

ఉసిరిని ఎలా తీసుకోవాలి..?: ఉసిరి కాయను చట్నీ రూపంలోనే కాకుండా రకరకాలుగా తీసుకోవచ్చు. అల్లం మురబ్బా మాదిరిగానే ఉసిరికాయ మురబ్బాను కూడా చేసుకుని తినవచ్చు. రాత్రిపూట ఒక టేబుల్ స్పూన్ ఉసిరి రసాన్ని గోరువెచ్చని నీటితో తీసుకోవడం వల్ల కూడా ప్రయోజనం ఉంటుంది. ఉసిరికాయను తేనెతో కలిపి తింటే ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. అంతేగాక ఉసిరిని కూరల్లో కూరగాయగా కూడా చేర్చుకోవచ్చు. ఉసిరికాయ తినడం ద్వారా రోగనిరోధక శక్తి బలపడుతుంది. దాంతో అనేక వ్యాధుల నుంచి మన శరీరం రక్షణ పొందుతుంది. ఉసిరిని సీజన్‌లో తరచూ తీసుకోవడం ద్వారా కీళ్ల నొప్పులు, వాపులు తగ్గుతాయి. యూరిక్ యాసిడ్ నియంత్రణలో ఉంటుంది.

# అన్ని గ్రామాలకు టెలీకం సేవలు



జయశంకర్ భూపాలపల్లి: మారుమూల గ్రామాలకు సైతం టెలికం సేవలు అందుంచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు టెలికమ్యూనికేషన్ జాయింట్ కంట్రోలర్ సీఎం సంపర్ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో టెలి కమ్యూనికేషన్ సేవలపై బిఎస్ఎన్ఎల్, టి ఫైబర్,ఎయిర్ టెల్, జియా సంస్థల అధికారులతో సమావేశం నిర్వహిం చారు. బిఎస్ఎన్ఎల్,టిఫైబర్, ఎయిర్ టెల్, జియా సేవలను అధికారుల ను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ జిల్లా లోని టెలికమ్యూనికేషన్ పరిస్థితులనుపరిశీలించేం దుకు టెలిక మ్యూనికేషన్స్ శాఖ అధికారులు ఆకాంక్షిత్మ జిల్లాలలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా వ్యాప్తంగా టెలి కం సేవల ప్రగతిని పరిశీలించి నివేదికను పంపనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో సేవలు, ప్రాజెక్టులు ఆశించిన లక్ష్యాలు సాధనలో ఎదుర్కొంటున్న అడ్డంకులు, పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాల పై అధికారులతో సమీక్షించారు.

జిల్లాలో భారత్ నెట్ అమలు, భారత్ నెట్ వినియోగదా రుల నుండి అందిన ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుని విస్తరణకు అవసరమైన చర్యలను చేపట్టను న్నట్లు ఆయన తెలిపారు.దేశ వ్యాప్తంగా2.50లక్షల గ్రామ పంచాయ తీల్లో టెలికం సేవలు విస్తృత పరచడం కేంద్ర ప్రభుత్వ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 2.14 లక్షల గ్రామ పంచాయితీలకు టెలికం సేవలు అందుబాటులోకి వచ్చాయని, మిగిలిన గ్రామ పంచాయతిల్లో అటవీ తదితర సమస్యలు

అనుమతులు రావాల్సి ఉన్నదని, త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరించి టెలికాం సేవలు అందుబాటులోకి తేనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ...జిల్లాలో 189 గ్రామ పంచాయతీల్లో టి ఫైబర్ సేవలు అందుబాటులో ఉన్నాయని, మిగిలిన గ్రామ పంచాయతీలకు టి ఫైబర్ సేవలు అందుబాటులోకి తేవడానికి అటవీ

అనుమతులు రావాల్సి ఉందని తెలిపారు. టి ఫైబర్ సేవలు అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అందించడానికి 1844 కిమి మేర ఆప్టికల్ ఫైబర్ లైన్ వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1670 కిమి పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన లైను పూర్తి చేయుటకు అటవీ అనుమతులు రావాల్సి ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో బిఎస్ఎన్ఎల్ 40

టవర్లు, ఎయిర్ టెల్ 54 టవర్లు ఉండగా మరో 5 టవర్లు ఎయిర్ టెల్ ఏర్పాటు చేయాల్సి ఉన్నదని తెలిపారు. జిల్లాలోని ప్రతి మారుమూల ప్రాంతానికి సెల్, అంతర్జాల సేవలు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సిపిఓ బాబూరావు, బిఎస్ఎన్ఎల్, టి ఫైబర్, ఎయిర్ టెల్, జియా తదితర అధికారులు పాల్గొన్నారు.

# 'టిడ్కో' లబ్ధిదారుల ఆశలన్నీ కూటమిపైనే..?



చిత్తూరు: టీడీపీ 2014-19 మధ్యలో అధికారంలో ఉన్నప్పుడు పట్టణ మౌలిక సదుపాయాల కల్పన అభివృద్ధి సంస్థ (టిడ్కో) ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు గృహ నిర్మాణాలను చేపట్టింది. 300, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు రకాల గృహ నిర్మాణాలను ప్రారంభించారు. 300 చదరపు అడుగుల గృహానికి లబ్ధిదారుడి వాటా రూ.500 కాగా, 365 చ.అడుగులకు రూ.50 వేలు, అలాగే 430 చ.అడుగులకు రూ.లక్ష డిపాజిట్ చేయాలి. ఈ మొత్తాన్ని లబ్ధిదారుల నుంచి అధికారులు నిర్మాణానికి ముందే వసూలు చేశారు. ప్రతి యూనిట్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ రూ.1.50 లక్షల చొప్పున, మొత్తం రూ.3 లక్షలు ఉంటుంది. యూనిట్‌ను బట్టి బ్యాంకు రుణాలూ ఉంటాయి. టీడీపీ హయాంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని నగర, పురపాలక సంఘాల్లో 17,395 టిడ్కో గృహాలను మంజూరు చేసింది. అప్పట్లోనే లబ్ధిదారుల నుంచి డబ్బులు కూడా వసూలు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పునాది దశలో ఉన్న గృహాలను 2020 జూన్‌లోనే రద్దు చేసేసింది. ఇలా ఉమ్మడి జిల్లాలో 6288 గృహాలు రద్దయ్యాయి.

తిరుపతిలో 1200, చిత్తూరులో 672, మదనపల్లెలో 1056, శ్రీకాళహస్తిలో 1632, పుంగనూరులో 624, పుత్తూరులో 576, నగరిలో 528 గృహాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. వైసీపీ ప్రభుత్వం 6,288 మంది గృహాలను రద్దు చేసినా, వారు చెల్లించిన డిపాజిట్లను మాత్రం వెనక్కి ఇవ్వలేదు. రద్దయిన గృహాల్లో 1360 మంది రూ.500 వంతున చెల్లించిన రూ.6.80 లక్షలు, 2784 మంది రూ.50 వేల చొప్పున చెల్లించిన రూ.13.92 కోట్లు, 2384 మంది రూ.లక్ష చొప్పున చెల్లించిన రూ.23.84 కోట్ల డిపాజిట్లను వెనక్కి ఇవ్వలేదు. మొత్తంగా రూ.37.82 కోట్లు వెనక్కి ఇవ్వాల్సి ఉంది. మాకు ఇళ్లు దక్కలేదు.. డిపాజిట్లూ వెనక్కి ఇవ్వలేదంటూ లబ్ధిదారులు నాలుగేళ్లుగా ఆవేదన చెందుతున్నారు. చిత్తూరు నగరంలోని పూణేపల్లె వద్ద టిడ్కో గృహ సముదాయాల్ని నిర్మించారు. టీడీపీ ప్రభుత్వంలో 70 శాతం పనులు పూర్తయ్యాయి. పునాది దశలో ఉన్న 672 గృహాలను ప్రభుత్వం రద్దు చేసింది. మిగిలిన 2832 గృహాల నిర్మాణానికి రూ.140 కోట్లను ఖర్చు చేశారు. గృహ సముదాయంలో రోడ్లు, కాలువలు వంటి మౌలిక వసతులూ కల్పించారు.

2020 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. అయినా ఇక్కడ లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేయలేదు. నెల రోజుల్లో టిడ్కో ఇళ్లను పంపిణీ చేయాలంటూ ఇటీవల జరిగిన చిత్తూరు నగరపాలక సంస్థ సమా వేశంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అధికారులను ఆదేశించారు. రద్దయిన ఇళ్ల లబ్ధిదారులకూ ప్రజాప్రతినిధులు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలోని గూడూరుపల్లె వద్ద నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను గతేడాది అక్టోబరులో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు.

# నోటీసులతో హైడ్రా సరేనా!



హైదరాబాద్, ,: హైడ్రా అధికారులు తొలుత హడావిడి చేశారు. దానిని చూసి అందరూ నిజమేనని అనుకున్నారు. ఇక హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాలన్నీ కూలిపోతాయని భావించారు. కానీ అది భ్రమేనని తేలింది. ఎందుకుంటే అనేకమంది రాజకీయ నాయకులు అక్రమ కట్టడాల జోలికి ఇక హైడ్రా వెళ్లే అవకాశాలు కనిపించడం లేదు. బిల్డర్లు, సాధారణ ప్రజలకు చెందిన ఆస్తులపై మాత్రమే హైడ్రా బుల్ డోజర్లు దూసుకెళుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే కొత్తలో హైడ్రా అధికారులు చూపిన ఉత్సాహం మాత్రం ఇప్పుడు కనిపించడం లేదు. పైగా రాజకీయ నేతల ఆక్రమణలను కూడా వదిలేది లేదని చెప్పిన అధికారుల కనీసం వాటికి నోటీసులు ఇచ్చే ప్రయత్నం కూడా చేయకపోవడంతో వాటి కూల్చివేతలు భ్రమేనని తేలింది.. ఒవైసీకి చెందిన కళాశాల అక్రమ నిర్మాణమని గతంలో హైడ్రా అధికారులు ప్రకటించారు. అలాగే బీఆర్ఎస్ నేత మల్లారెడ్డికి చెందిన కళశాల భవనాలు కూడా ఆక్రమణ చేసినవేనని నిర్ధారించినట్లు హైడ్రా అధికారులు తెలిపారు. కానీ కళాశాలలకు సెలవుల సమయంలో వాటిని కూల్చివేస్తామని, విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం కూల్చివేయడం లేదని నాలుగైదు నెలల క్రితం ప్రకటించారు. జనం కూడా నిజమేనని అనుకున్నారు. ఇది రాజకీయంగా కూడా విమర్శలు పెద్దయెత్తున విమర్శించాయి. ఒవైసీ బ్రదర్స్ కూడా హైడ్రాపై నిప్పులు చెరిగారు. చెరువులను ఆక్రమించి నిర్మించారనుకుంటే ముందు సచివాలయాన్ని కూల్చివేయాలని కూడా వారు సవాల్ విసిరారుఅయితే ఇటీవల కాలంలో ఒవైసీ సోదరులు అధికార కాంగ్రెస్ కు దగ్గరయ్యారు. రేవంత్, ఒవైసీ సోదరులు కలసి ఈ మధ్య ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. త్వరలోనే పాతబస్తీకి చెందిన ఎంఐఎం ఎమ్మెల్యేలతో తాను సచివాలయంలో సమావేశమై అక్కడి సమస్యల పైచర్చిస్తామని తెలిపారు. అంత వరకూ ఓకే కానీ, ఎన్నికల వరకే రాజకీయాలు అని, తర్వాత తామంతా భాయ్..

భాయ్ అని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించడంతో ఇక హైడ్రా బుల్ డోజర్ రాజకీయ నేతల అక్రమ నిర్మణాల వైపు వెళ్లదని చూచాయగా అర్థమయింది. దీంతో పాటు ప్రయివేటు సంస్థలకు చెందిన ఆస్తులపైనే ఎక్కువ దృష్టిపెడుతూ తామేంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నట్లు బిల్డప్ ఇస్తుందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. హైడ్రాకు కూడా రాజకీయ రంగు పులుముకుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

అలాగేమల్లారెడ్డి కళాశాల విషయంలోనూ అదే జరగొచ్చు. అందుకే హడావిడిగా చేసే ఆర్భాటపు ప్రకటనలను నమ్మితే ఇలాగే ఉంటుందని సోషల్ మీడియాలో సెటైర్లు వినిపిస్తున్నాయి. ఎఫ్.టి. ఎల్.బఫర్ జోన్ పరిధిలో ఉన్నవాటిని కూల్చివేస్తామన్న హైడ్రా అధికారులు ఇప్పుడు పీచే ముడ్ అన్నట్లుగానే కనపడుతుంది.

# 3 పథకాలకు 30 వేల కోట్లు... నిధులు ఎలా...?

పథకాలకు వేల కోట్ల రూపాయలు అవసరం ఉండగా ప్రభుత్వ ఖజానాలో మాత్రం అంత డబ్బు లేదట.కాంగ్రెస్ హామీ ఇచ్చిన గ్యారెంటీల అమలుతో పాటు ఉద్యోగుల జీతాలు-పెన్షన్లు, రోటీన్‌గా జరిగి అభివృద్ధి సంక్షేమ పథకాలకే నిధులు సరిపోవడం లేదట. పైగా గత ప్రభుత్వాలు చేసిన అప్పులకు వడ్డీలు, నెలవారి వాయిదాలు చెల్లించే సరికే కాంగ్రెస్ సర్కార్‌కు తలప్రాణం తోకకు వస్తోందట.రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు ఏడాదికి 12 వేల రూపాయలను ఇస్తామని ప్రకటించింది కాంగ్రెస్ ప్రభుత్వం. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలాగా భూములన్నింటికీ కాకుండా వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతు భరోసా ఇస్తామంటున్నారు. ఆ లెక్కన చూసుకున్నా తెలంగాణలో దాదాపు కోటీ 40లక్షల ఎకరాల భూములు వ్యవసాయ యోగ్యంగా ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.అంటే రైతు భరోసా మొదటి విడత ప్రారంభిస్తే ఎకరానికి 6 వేల రూపాయల చొప్పున దాదాపు కోటీ 40లక్షల ఎకరాలకు దాదాపు 8,400 కోట్ల రూపాయలు అవసరం అవుతాయని వ్యవసాయ శాఖ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది.ఇక నుంచి భూమి లేని వ్యవసాయ రైతు కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయల చొప్పున ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణలో మొత్తం 1.16 కోట్ల కుటుంబాలు ఉన్నాయని నిర్వహించిన ఇంటింటి సర్వేలో తేలింది. వీరిలో నిరుపేదలను గుర్తించేందుకు జాతీయ ఉపాధి హామీకూలీ గుర్తింపు కార్డును ప్రాతిపదికగా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.తెలంగాణలో మొత్తం 53 లక్షల మందికి ఉపాధి హామీ గుర్తింపు కార్డులున్నా, వారిలో 32 లక్షల మంది మాత్రమే రోజూ కూలీ పనులకు వెళ్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయట. ఈ కార్డుదారుల్లో దాదాపు 22 లక్షల మందికి భూమి లేదని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీరికి రైతు భరోసా కింద మొదటి విడతలో 6వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తే 1,320 కోట్ల రూపాయలు అవసరం అవుతాయి.రైతు కూలీలను అర్హులుగా గుర్తించే విషయంలో డైలమాలో ఉందట సర్కార్. ఉపాధి హామీ కూలీల్లో సగం మందిని తప్పిస్తే వారిలో వ్యతిరేకత వస్తుందని, దాని ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై పడుతుందని రేవంత్ సర్కార్ భావిస్తోందట. ప్రస్తుతం ఉపాధి హామీ కూలీలుగా ఉన్న రైతు కూలీలు 46 లక్షల మందికి ఏడాదికి 12 వేల చొప్పున చెల్లిస్తే 5వేల 200 కోట్లు అవసరం అవుతాయి. అంటే మొదటి విడతలో 6వేల చొప్పున ఇచ్చి 2వేల 600 కోట్లు కావాలి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఇంత పెద్ద మొత్తంలో నిధులను చెల్లించే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం లేదంటున్నారు అధికారులు. ఇక నెలాఖరు నుంచి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం చేస్తామంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం తెలంగాణలో దాదాపు 84 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.ఒక్కో ఇందిరమ్మ ఇంటికి ఐదు లక్షల ఆర్థిక సాయంలో భాగంగా మొదటి విడతలో లక్ష రూపాయల చొప్పున చెల్లించినా 5 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయి. అంటే రైతు భరోసాకు 8వేల 400 కోట్లు, రైతు కూలీలకు 1,320 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లకు 5వేల కోట్లు..మొత్తం కలిపి దాదాపు 15 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయి. ఇక జనవరి 26 తర్వాత నాలుగు రోజులకే ఫిబ్రవరి 1న ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకు మరో 4వేల 500 వేల కోట్లు కావాలి. అంటే తెలంగాణ సర్కార్‌కు ప్రస్తుతం దాదాపు 20 వేల కోట్ల రూపాయలు అవసరం.ప్రజల్లో నమ్మకం పోతుందని, ప్రతిపక్షాలకు అస్త్రంగా మారతామనే ఆందోళన..ఇక రోటీన్‌గా జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కూడా డబ్బులు కావాల్సిందే. అందుకే వస్తోందంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం కంగారు పడుతోందట. ఈ నేపథ్యంలోనే ఖజానాను నింపుకునేందుకు ఉన్న అన్ని మార్గాలను అన్వేషిస్తున్నారని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి.ఏడాది కాలంగా నానుతూ వస్తున్న రైతు భరోసా,ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రారంభించకపోతే ఇటు ప్రజల్లో నమ్మకం కోల్పోవడంతో పాటు, ప్రతిపక్షాలకు అస్త్రంగా మారుతామని రేవంత్‌సర్కార్ ఆందోళన చెందుతోందట.ఎలాగైనా ఖజానాకు 20 వేల కోట్ల రూపాయలను జమచేసి మాటిచ్చినట్లు ఆయా పథకాలనుఅమలు చేసి తీరాల్సిందేనన్న పట్టుదలతో ఉన్నారట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ప్రభుత్వం నిధులను సమీకరించి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందా లేదా తెలియాలంటే వరకు వెయిట్ చేయాల్సిందే.

# రేషన్ కార్డులపై గుడ్ న్యూస్ చెప్పిన రేవంత్ సర్కార్..




**హైదరాబాద్,:** తెలంగాణలో కొత్త రేషన్ కార్డులతోపాటు ఉన్న రేషన్ కార్డులో చేరికలు, తొలగింపుల కోసం లక్షల మంది ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఉప ఎన్నికలు జరిగిన నియోజకవర్గాల్లో మినహా గత సర్కార్ కొత్తగా ఎవరికీ రేషన్ కార్డు జారీ చేయలేదు. కనీసం కుటుంబ సభ్యులు పేర్లు చేర్చే అవకాశం కూడా ఇవ్వలేదు. తాము అధికారంలోకి వస్తే అర్హులందరికీ రేషన్‌కార్డులు జారీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ గెలుపులో ఇదీ ఒక కారణమే.

అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా కొత్త కార్డుల జారీకి రేవంత్ సర్కార్ శ్రీకారం చుట్టింది. 2025, నుంచి కొత్త కార్డులు జారీ చేస్తామని ప్రకటించింది. రేషన్ కార్డులకు సంబంధించిన ఇప్పటికే అందిన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

## ఈ అర్హతలు ఉంటే చాలు..!

రేషన్ కార్డుల జారీకి సంబంధిచి తెలంగాణ ప్రభుత్వం జనవరి 13న గైడ్‌లైన్స్ విడుదల చేసింది. రేషన్ కార్డుల జారీపై కేబినెట్ సబ్‌కమిటీ చేసిన సిఫారసుల ఆధారంగా మార్గదర్శకాలు జారీ చేసింది. 1. కులగణన సర్వే ఆధారంగా రేషన్‌కార్డు లేని కుటుంబాల జాబితా ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వే చేస్తారు.మండలస్థాయిలో ఎంపీడీవో, పట్టణస్థాయిలో మున్సిపల్ కమిషనర్ ఈ ప్రక్రియ పూర్తి చేస్తారు.జిల్లాస్థాయిలో అదనపు కలెక్టర్లు, డీసీఎస్‌వోలు పర్యవేక్షిస్తారు. రేషన్‌కార్డుల దరఖాస్తుల ఆధారంగా అర్హుల జాబితా గ్రామసభలో చదివి వినిపిస్తారు. ఈ గ్రామ సభలో జాబితాపై చర్చించి ఆమోదిస్తారు.గ్రామసభ లేదా వార్డు సభలో ఆమోదించిన జాబితాను మండల, మున్సిపల్ అధికారులు కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు పంపుతారు.ఈ జాబితాపై కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్ తుది నిర్ణయం తీసుకుంటారు. తర్వాత కార్డులు జారీ చేస్తారు.

మార్పులు, చేర్పులు..:ఇక రేషన్‌కార్డులో పేర్ల మార్పులు, చేర్పుల కోసం ప్రభుత్వం అవకాశం కల్పించింది. సభ్యుల పేర్లకు సంబంధించి ఆధార్ కార్డులు, మ్యారేజీ సర్టిఫికెట్లు అధికారులకు అందించాలి. అంతేకాదు సంబంధిత సభ్యుల బర్త్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలి. ప్రజాపాలన సమయంలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తులు స్వీకరించారు. అయితే అప్పట్లో దరఖాస్తు చేయనివారు ఆన్‌లైన్‌లో దరకాస్తు చేసుకోవచ్చు. రేషన్‌కార్డును ఏడాదికి కుటంబానికి వచ్చే ఆదాయం ప్రామాణికంగా తీసుకుంటారు.

# విస్తరణ కోసం సామ్రాజ్యవాదం పాట్లు!

తన ప్రభావాన్ని, తన పెత్తనం కింద ఉండే భూభాగాన్ని సైతం విస్తరించుకోడానికి ద్రవ్య పెట్టుబడి అనివార్యంగా తీవ్రంగా పాటు పడుతుంది" అని లెనిన్ తన ప్రసిద్ధ గ్రంథం "సామ్రాజ్యవాదం-పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ"లో పేర్కొన్నారు. సామ్రాజ్యవాద దేశాలు వాటిలో అవి తీవ్ర శత్రుత్వంతో తలపడుతున్న కాలంలో లెనిన్ ఈ గ్రంథాన్ని రాశారు. ఆ కాలంలో ప్రత్యర్థులుగా ఉన్న ఆ యా దేశాల ద్రవ్య పెట్టుబడులు అప్పటికే ప్రపంచాన్ని తమ నడుమ పంచుకుని వున్నందున ఇక విస్తరించడానికి అదనంగా మిగిలిన జాగా అంటూ ఏదీ లేకపోయింది. అందుచేత తమ తమ పెత్తనాల కింద ఉన్న ప్రాంతాలను మళ్ళీ మరోసారి పునర్విభజన చేసుకోవడం మినహా వారికి వేరే దారి లేకపోయింది. అందుకు పరస్పరం యుద్ధాలలో తలపడడం తప్ప వేరే పద్ధతి లేకుండా పోయిం ది. ఐతే ఆ యుద్ధాలు సామ్రాజ్యవాదం మొత్తంగా బలహీన పడడానికే దారి తీశాయి. అంతేకాక, సామ్రాజ్యవాద పెత్తనం నుండి విడిపోయి విప్లవాల ద్వారా సోషలిస్టు దేశాలు ఏర్పడడానికి, ఆ సోషలిస్ట దేశాల మద్దతుతో అనేక వలస దేశాలు సామ్రాజ్యవాదుల ఆధిపత్యం నుంచి బైట పడడానికి కూడా ఆ పరిస్థితులు దారి తీశాయి. అనంతర కాలంలో పెట్టుబడి కేంద్రీకరణ కొనసాగింది. అంతేగాక అది బలపడింది. ఆ శక్తితోనే ద్రవ్య పెట్టుబడి ఇప్పుడు సామ్రాజ్యవాదుల నడుమ ఉండే వైరుధ్యాన్ని అదుపు చేయగలు గుతోంది. అక్కడితో ఆగకుండా ఇప్పుడు యావత్తు ప్రపంచమూ తన స్వైర విహారానికి దాసోహం అనాలనే వైఖరి తీసుకుంది. ఈ నేపథ్యంలో ఐక్యంగా వ్యవహరిస్తున్న సామ్రాజ్యవాద శిబిరం ఒకప్పుడు తన పెత్తనం కింద ఉన్న భూభాగాల్లో మళ్ళీ పెత్తనం చెలాయించడానికి తయారౌతోంది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, సామ్రాజ్యవాదం తమ లక్ష్యాలను నెరవేర్చుకోడానికి రెండు మార్గాలను అనుసరిస్తున్నాయి. మొదటిది: ప్రపంచం మొత్తం మీద నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థను బలవంతంగా రుద్దడం. ఈ విధానాలు వలస విముక్తి అనంతరం ఆ యా దేశాలు సాధించిన పురోగతిని దెబ్బ తీస్తాయి. రెండవది: ఈ మొదటి ప్రయత్నం పని చేయని చోట్ల యుద్ధాలను పురికొల్పడం. నయా ఉదారవాద వ్యవస్థ ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గాన్ని బలహీన పరచింది. తన ఉత్పత్తి కార్యకలాపాలనన్నింటినీ తక్కువ వేతనాలకే పని చేసే కార్మికులుండే మూడవ ప్రపంచ దేశాలకు తరలించుకు పోతానని బెదిరిస్తూ అది అభివృద్ధి చెందిన దేశాల కార్మిక వర్గాన్ని బెదిరిస్తోంది. ఆ విధంగా అక్కడ వేతనాలను పెరగనివ్వకుండా స్తంభింపజేసింది. ఉత్పత్తి కార్యకలాపాలు తరలివచ్చిన మూడవ ప్రపంచ దేశాలలో సైతం కార్మికుల నిజ వేతనాలలో పెరుగుదల ఏమీ లేదు. అక్కడ నిరుద్యోగం ఏ మాత్రమూ తగ్గకపోవడమే దీనికి కారణం. వేతనాలలో ప్రపంచం మొత్తం మీద ఎక్కడా పెరుగుదల లేకపోవడంతో బాటు శ్రామిక ఉత్పాదకత బాగా పెరిగింది. దాని ఫలితంగా ఆర్థిక సంపదలో పెట్టుబడిదారుల వాటా బాగా పెరిగింది. ముఖ్యంగా సంపన్న దేశాల వాటా బాగా పెరిగింది. ఆర్థిక అసమానతలు వేగంగా పెరిగిపోయాయి. దానితోబాటు శ్రామికుల వేతనాలలో పెరుగుదల లేని కారణంగా వారిలో అత్యధికులు, ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల శ్రామికులు పోషకాహార లేమితో బాధ పడుతున్నారు. మరోపక్క సంపన్నుల వద్ద పోగుబడే సంపద ఎంత పెరిగినా, వారి వినిమయం ఆ మేరకు పెరగదు. కనుక సమాజంలో అధికోత్పత్తి సమస్య ముందుకొచ్చింది (అధికోత్పత్తి అంటే ఉత్పత్తి అయ్యే సరుకుల పరిమాణం పెరగడం అని మాత్రమే అనుకోరాదు. ప్రజల కొనుగోలు శక్తికి మించి ఉత్పత్తి ఉంటే అది అధికోత్పత్తి అవుతుంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయి, ఉత్పత్తి అయ్యే సంపద ఇదివరకటి స్థాయిలోనే ఉన్నా అది అధికోత్పత్తి అవుతుంది. ఈ అధికోత్పత్తి సమస్యను పరిష్కరించడానికి కీన్స్ సూచించిన మార్గం ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం. ఆ మార్గం ప్రస్తుత నయా ఉదారవాద వ్యవస్థలో అమలు చేయడం ప్రభుత్వాలకి సాధ్యం కాదు. ప్రభుత్వ వ్యయాన్ని పెంచి దేశంలో డిమాండ్‌ను బలపరచడానికి రెండు మార్గాలు ఉన్నాయి. మొదటిది ద్రవ్య లోటును బాగా పెంచి రుణాలు తెచ్చి దానిని ఖర్చు చేయడం. రెండవది సంపన్నుల మీద అధికంగా పన్నులు వేసి ఆ ధనం ఖర్చు చేయడం.

ఈ రెండు మార్గాలూ నయా ఉదారవాదానికి అంగీకారం కాదు. దానిని కాదని ఏ దేశమైనా ముందుడుగు వేస్తే వెంటనే ఆ దేశం నుండి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఒక్కపాటున తరలిపోతుంది. ఆ దేశ ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల్లో పడుతుంది. అందుచేత ప్రతీ దేశమూ దాని నిబంధనలకు తలొగ్గి వ్యవహరిస్తున్నది. నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థలో అనివార్యంగా తలెత్తిన ఈ అధికోత్పత్తి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఆర్థిక మాంద్యంలోకి నెడుతోంది. ఇదే సమయంలో నయా ఫాసిజం ఉవ్వెత్తున ముందుకొస్తోంది. ఈ నయా ఫాసిస్టు శక్తులతో కార్పొరేట్లు జత కట్టడానికి అనుకూలంగా ఉంటాయి. ఎందుకంటే నయా ఫాసిజం ప్రజానీకపు దృష్టిని ప్రస్తుత ఆర్థిక దోపిడీ నుంచి పక్కకు మళ్ళించగలిగే శక్తి కలిగివుంది. నయా ఫాసిస్టులు ప్రజల ముందు వారి నిత్య జీవితపు భౌతిక పరిస్థితుల గురించి కాక, ఆ ప్రజల్లోని ఏవో కొన్ని మైనారిటీ సమూహాలపై (అవి మత పరంగా కాని, జాతి పరంగా గాని మైనారిటీలు కావచ్చు) విద్వేషాన్ని రెచ్చగొట్టి వారిని పరాయివారిగా చిత్రిస్తుంది. కొన్ని దేశాలలో నయా ఫాసిస్టు శక్తులు అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. మరికొన్ని దేశాలలో అధికారం కోసం అర్రులు చాస్తున్నాయి. ఉదారవాద ప్రజాస్వామ్య వ్యవస్థల్లో నయా ఫాసిస్టు శక్తులు అధికారాన్ని పూర్తిగా చేజిక్కించుకోడానికి సాపేక్షంగా కొంత సమయం పట్టవచ్చు. ఈ నయా ఫాసిస్టు శక్తులు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆ యా దేశాలలో అధికోత్పత్తి సమస్య పరిష్కారం కాదు. ఆ దేశ ఆర్థిక వ్యవస్థ నయా ఉదారవాద చట్రం లోపలే నడుస్తూ వుంటుంది. అందుచేత అక్కడ ప్రభుత్వ వ్యయం పెంచి అధికోత్పత్తి సమస్యను పరిష్కరించడం ఆ నయా ఫాసిస్టు ప్రభుత్వాలకి కూడా సాధ్యం కాదు. ఆ యా దేశాల ప్రభుత్వాలు ఆర్థిక మాంద్యం సమస్యని పరిష్కరించడంలో విఫలం అయినందువల్ల అక్కడ నయా ఫాసిస్టు శక్తులు బలపడితే దానికి సామ్రాజ్యవాదాన్ని ఎలా బాధ్యుల్ని చేస్తారు మీరు? అని కొందరు అడగవచ్చు. సమాధానం ఒక్కటే. ఆర్థిక మాంద్యం నుండి బైట పడాలంటే ఏ దేశమైనా నయా ఉదారవాద చట్రం పట్టునుండి బైట పడాలి. అలా బైట పడేందుకు ఏ దేశమైనా ప్రయత్నిస్తే వెంటనే సామ్రాజ్యవాద దేశాలు, మరీ ముఖ్యంగా అమెరికా ఆ దేశం మీద ఆంక్షలు విధిస్తాయి.

ఆ విధంగా సామ్రాజ్యవాదం తన గతకాలపు పెత్తనాన్ని తిరిగి సాధించడానికి చేస్తున్న ప్రయత్నాలు ప్రపంచమంతటా ప్రజానీకాన్ని తీవ్ర దారిద్ర్యంలోకి, కడగండ్లలోకి నెట్టడమే కాకుండా నయా ఫాసిస్టు శక్తులు బలపడడానికి సైతం ఊతం ఇస్తున్నాయి.

ఇక సామ్రాజ్యవాదం అనుసరించే రెండో మార్గం యుద్ధాలను పురికొల్పడం. ప్రస్తుతం నడుస్తున్న రెండు యుద్ధాలూ ప్రపంచాన్ని వినాశనం అంచుకు నెడుతున్నాయి. ఈ రెండు యుద్ధాలూ ఇలా కొనసాగడానికి వాటి వెనుక సామ్రాజ్యవాదం పోషిస్తున్న పాత్రే ప్రధాన కారణం. అంతే కాదు, ఈ రెండు యుద్ధాలూ అణు యుద్ధాలుగా మారిపోయే ప్రమాదం కూడా ఉంది.

# ఆ నాలుగు మండలాలకు మహర్దశ

హైదరాబాద్: హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నగరంలో పెట్టుబడులు పెట్టాయి. మరికొన్ని సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ సిటీలు గణనీయమైన అభివృద్ధిని సాధించాయి. నగర విస్తరణలో భాగంగా రేవంత్ సర్కార్ ఫోర్త్ సిటీ పేరుతో ఫ్యూచర్ సిటీని ప్లాన్ చేస్తోంది. అందుకు సంబంధించిన కార్యచరణ ప్రారంభించింది. రాష్ట్రంలో కొత్తగా ఐటీ సంస్థలు, పరిశ్రమలను స్థాపించేందుకు సర్కార్ శరవేగంగా ప్రణాళికలను రెడీ చేస్తోంది. ఫోర్త్ సిటీ చుట్టూ వీటిని ఏర్పాటు చేసేందుకు వీలుగా ప్రభుత్వ, పట్టా భూముల వివరాలను సేకరించేందుకు ఇప్పటికే రెవెన్యూ అధికారుల కసరత్తు చేస్తున్నారు.రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ఆరు మండలాల్లో ఈ పరిశ్రమలు స్థాపించనున్నారు. ఔటర్‌కు సమీపంలోని కొన్ని, ఎయిర్‌పోర్టుకు దగ్గరగా మరికొన్ని ప్రాంతాలను ఇప్పటికే అధికారులు పరిశీలించారు. ఆరు మండలాల్లో కొన్ని గ్రామాలను సూత్రప్రాయంగా ఎంపిక చేశారు. గత ప్రభుత్వం పరిశ్రమలకు స్థలాలిచ్చి ఇప్పటికీ కార్యకలాపాలు కొనసాగించకపోతే వాటిని వెనక్కితీసుకునేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. ఫోర్త్ సిటీకి పదిహేను కిలోమీటర్ల విస్తీర్ణంలో కొత్తగా పరిశ్రమలు, టెక్స్‌టైల్ హబ్‌లను ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమీపంలో ఫాక్స్‌కాన్ సంస్థ ఆపిల్ ఫోన్ విడిభాగాల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. అలాగే షాబాద్ మండలంలో ఎలక్ట్రిక్ ఈవీ బస్సుల తయారీ, టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ఇప్పటికే తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. కొత్తగా ఆయా ప్రాంతాల్లో ఐటీ, పరిశ్రమల హబ్‌లతో పాటు ఎడ్యుకేషన్ ఇనిస్ట్యూషన్స్, గేమింగ్ జోన్స్, రెస్టారెంట్లను ప్రారంభిస్తే రానున్న నాలుగైదేళ్లలో అక్కడ కూడా అభివృద్ధి వేగవంతమవుతుందనిఅధికారులు భావిస్తున్నారు.చేవెళ్ల, ఇబ్రహీంపట్నం,మేడ్చల్, ఘట్‌కేసర్,శేరిలింగంపల్లి, మహేశ్వరం మండలాల పరిధుల్లో ప్రభుత్వస్థలాల వివరాలనుఅధికారులు ఇప్పటికే సేకరించారు.ఒక్కో ప్రాంతంలో కనీసం1000 ఎకరాలు సేకరించాలని టార్గెట్ గాపెట్టుకున్నారు.సెజ్ తరహాలో ఒకేచోట 200,300 ఎకరాలు సేకరించాలని భావిస్తున్నారు. పరిశ్రమలు, ఐటీ సంస్థలకు సమీపంలో ప్రభుత్వ స్థలాలను అభివృద్ధి చేస్తే అక్కడ ఉద్యోగులు, కార్మికులు నివాసముండేందుకు వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు. ఐటీ సంస్థలు, పరిశ్రమలస్థాపన కోసం ప్రభుత్వం కేటాయించే భూములు అన్ని అవసరాలకు అనుకూలంగా ఉండేలా అధికారులు చూస్తున్నారు. కాగా, పైన చెప్పిన ఆరు మండలాల్లో ఐటీ సంస్థలు,పరిశ్రమలు వస్తే వాటికి మహర్దశ పట్టనుంది. ఊహించనంతగా అభివృద్ధి జరుగుతుంది.

# కళ్లు చెదిరే లాభాలు..

## పేపర్ బ్యాగ్ తయారీతో భారీగా ఆదాయాలు



రోజులు మారుతున్నాయి, మారిన కాలానికి అనుగుణంగా వ్యాపార ఆలోచనల్లోనూ మార్పులు వస్తున్నాయి. మార్కెట్ అవసరాలతో పాటు, మార్కెట్లో ట్రెండీ బిజినెస్‌ను స్టార్ట్ చేయడం వల్ల భారీగా లాభాలు ఆర్జించవచ్చు. ప్రస్తుతం ప్రభుత్వాలు ప్లాస్టిక్స్ వినియోగాన్ని భారీగా తగ్గిస్తున్నాయి. ఇందులో భాగంగానే ప్లాస్టిక్ కవర్స్‌పై నిషేధం విధించారు. ఈ క్రమంలోనే పేపర్ బ్యాగ్‌లకు డిమాండ్ పెరుగుతోంది. చిన్న చిన్న దుకాణాలు మొదలు, పెద్ద పెద్ద షాపుల వరకు పేపర్ బ్యాగులను ఉపయోగిస్తున్నారు. ఈ పేపర్ బ్యాగుల తయారీ వ్యాపారాన్ని ప్రారంభిస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చు.

ఇంతకీ పేపర్ బ్యాగ్‌ల తయారీకి ఎంత ఖర్చు అవుతుంది.? లాభాలు ఎలా ఉంటాయన్న వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.. సాధారణంగా పేపర్ బ్యాగ్ తయారీ పరిశ్రమను ప్రారంభించాలంటే ముఖ్యంగా మూడు మిషన్స్ కావాలి. వీటిలో ఒకటి.. పేపర్ బ్యాగ్ మేకింగ్ మిషన్. ఇందులో విత్ ప్రింట్ కూడా ఉంటుంది. కస్టమర్స్ అవసరాలకు అనుగుణంగా ప్రింట్ చేయొచ్చు. ఈ మిషిన్స్ ప్రారంభ ధర రూ. 3 లక్షల నుంచి మొదలవుతుంది. క్రేజింగ్ మిషన్, హైలెట్ పంచ్ మిషన్ అవసరపడుతుంది. ఇక పేపర్ బ్యాగ్‌ల తయారీకి కొంతమేర స్థలం కావాల్సి ఉంటుంది.

3 ఫేజ్ విద్యుత్ లైన్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. బ్యాగులను తయారు చేసిన తర్వాత మీరే సొంతంగా బ్రాండింగ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో కూడా విక్రయించవచ్చు. ఇక లాభాల విషయానికొస్తే.. ఒక కేజీ పేపర్ బ్యాగుల తయారీకి రూ. 30 నుంచి రూ. 35 వరకు ఖర్చవుతుంది. వీటిని రూ. 60 వరకు అమ్ముకోవచ్చు. అంటే కిలో పేపర్ బ్యాగులను విక్రయిస్తే కనీసం రూ. 30 లాభం ఆర్జించవచ్చు. ఈ మిషిన్స్ సహాయంతో రోజుకు 700 కిలోల పేపర్ బ్యాగులను తయారు చేయవచ్చు. అంటే రోజుకు రూ. 18,000 వరకు ఆదాయం పొందొచ్చు.

# బీబీనగర్ ఎయిమ్స్ లో హెచ్ఎంపీవీ

## వైరల్ డయాగ్నస్టిక్ రీసెర్చ్ లాబోరేటరీ

హైదరాబాద్ : కొవిడ్ తర్వాత చైనాలో పుట్టుకొచ్చిన హెచ్ఎంపీవీ కేసులు.. అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తున్నాయి. పొరుగునే ఉన్న భారత్ ఈ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. కొవిడ్ సమయంలోని అనుభవాలతో ముందస్తు జాగ్రత్తగా వైద్యారోగ్య శాఖ అనేక ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా.. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అనుమానిత హెచ్ఎంపీవీ కేసుల్ని పరిశీలించేందుకు ఏర్పాట్లు చేస్తోంది ఇందులో భాగంగా తెలంగాణలోనూ హెచ్ఎంపీవీ పరీక్షలు జరిపేందుకు అవకాశం కల్పించిన కేంద్రం.. యాదాద్రి భువనగిరిలోని బీబీనగర్ ఎయిమ్స్ లో ఈ మేరకు ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలో హెచ్ఎంపీవీ అనుమానిత కేసులను గుర్తిస్తే బీబీనగర్ ఏయిమ్స్ ఆస్పత్రిలోని వైరల్ డయాగ్నస్టిక్ రీసెర్చ్ లాబోరేటరీలో పరీక్షించనున్నారు. కోవిడ్ తో పోలిస్తే హెచ్ఎంపీవీ వైరస్ కేసులు ప్రస్తుతానికి భారత్ లో తక్కువగానే నమోదవుతున్నాయి. అందులోనూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ కేసుల సంఖ్య మరీ తక్కువగా ఉంది. దీంతో.. ఊపిరి పీల్చుకుంటున్న రాష్ట్ర వైద్యాధికారులు.. ముందస్తు చర్యల్లో భాగంగా ఈ ప్రయోగశాల ఏర్పాటు కోసం కేంద్రాన్ని అభ్యర్థించారు. కాగా.. ఈ ప్రయోగశాలలో ఇప్పటి వరకు పది నమూనాలను పరీక్షించగా అన్ని నెగిటివ్ వచ్చినట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి ఇటీవల దేశవ్యాప్తంగా అక్కడక్కడా నమోదవుతున్న క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో కేసులు లేకపోవడం ఉపశమనం కలిగించే అంశమని అంటున్నారుహెచ్ఎంపీవీ పరీక్షల కోసం భారత వైద్య పరిశోధన మండలి ? ఐసిఎంఆర్ దేశవ్యాప్తంగా 41 వైరాలజీ ప్రయోగశాలలో నమూనాలను పరీక్షించేందుకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అందులో.. తెలంగాణ రాష్ట్రంలో హెచ్ఎంపీవీ అనుమానిత కేసులను బీబీనగర్ ఎయిమ్స్ కు పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర వైద్యారోగ్య సూచించింది. వీఆర్డీఎల్ మోడల్ అధికారిగా డాక్టర్ రాహుల్ నారంగ నియమితులయ్యారు. జలుబు, దగ్గు, తుమ్ములు, గొంతు నొప్పి ఉన్న వారందరికీ హెచ్ఎంపీవీ వైద్య పరీక్షలు చేయటం వీలయ్యే పని కాదని అధికారులు అంటున్నారు. అందుకోసమే ఇన్‌ఫ్లూయంజా, ఆర్ఎస్‌వీ(రెస్పిరేటరీ సింక్రిటీయల్ వైరస్), సార్స్ కోవ్-2 పరీక్షల్లో నెగెటివ్ వస్తేనే హెచ్ఎంపీవీ పరీక్ష నిర్వహించనున్నారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అనుమానాలు ఉన్న నమూనాలను ఎయిమ్స్ తీసుకువచ్చి ఇక్కడ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో పాజిటివ్ వస్తే ఉన్నతాధికారులకు నివేదించి, బాధ్యతలకు వైద్య సహాయం అందించనున్నారు. ఈ మేరకు బీబీనగర్ ఎయిమ్స్ లో పరీక్షా కిట్లు, ఇతర సామాగ్రిని సిద్ధంగా ఉంచినట్లు అధికారులు వెల్లడించారు.

## ఏపీలో వాట్సప్ గవర్నెన్స్

విజయవాడ: విజన్ ఉన్నవారికి దూరదృష్టి ఎక్కువ. భావితరాల గురించి ఆలోచన చేస్తారు. సమస్యలకు పరిష్కారం కనుగొంటారు. పనులు త్వరగా జరిగేలా చేస్తారు. వ్యయ ప్రయాసలు లేకుండా చూస్తారు. ఉపాధి కల్పనపై దృష్టి పెడతారు. విజన్ ఉంటే.. ఎంత కష్టమైన పని అయినా సులభం అవుతుంది. భావి సమస్యలను పరిష్కరిస్తుంది. ఆటంకాలను తొలగిస్తుంది. అవసరాలను తీరుస్తుంది. వ్యయ ప్రయాసలు లేకుండా చేస్తుంది. రాజకీయాల్లో మంచి విజన్ ఉన్న నేతగా ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడుకు గుర్తింపు ఉంది. టెక్నాలజీని విరివిగా వినియోగించడంలో ఆయన దిట్ట. తెలంగాణ రాజధాని అభివృద్ధికి ఆయన విజనేకారణం. ఇప్పుడు ఏపీ సీఎంగా మరో సాంకేతిక విప్లవానికి శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ క్రమంలో వాట్సాప్ గవర్నెన్స్ తీసుకురాబోతున్నారు. ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు ప్రారంభించబోతున్న వాట్సాప్ గవర్నెన్స్‌తో ప్రజలు పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అవసరం ఉండదు. ఇంట్లో నుంచే సేవలను పొందవచ్చు. డేట్ ఆఫ్ బర్త్, కులం, నివాసం, ఆదాయం వంటి 150 సర్వీస్‌లు ఆన్‌లైన్‌లో పొందవచ్చు. ప్రజల సమస్యలు, ఇబ్బందలు తొలగించేందుకు ఈ సేవలను అందుబాటులోకి తెస్తున్నారు. సమయం వృథా కాకుండా ఉండడమే కాకుండా డబ్బులు ఆదా అవుతాయని అధికారులు పేర్కొంటున్నారుదేశంలో 64 లక్షల పెన్షన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. పెన్షన్ల కోసం ఏటా రూ. 33 వేల కోట్లు ప్రజలకు ఇస్తుంది. హెల్దీ, వెల్దీ, హ్యాపీ సొసైటీ అనే లక్ష్యాలతో ప్రభుత్వం నూతన సాంకేతిక విప్లవానికి శ్రీకారం చుట్టబోతోంది. పేదరికం, ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకు చర్యలు తీసుకుంటోంది. చంద్రబాబు నాయుడు సీఎం అయ్యాక పెన్షన్లు రెట్టింపు చేశారు. దీంతో పేదల ఆదాయం పెరిగింది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 199 అన్న క్యాంటీన్లద్వారా పేదల ఆకలి తీరుస్తున్నారు. ఇక పైపులైన్ ద్వారా వంటగాయస్ సరఫరాకు చర్యలు చేపడుతున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని వివిధ వర్గాలకు పెండింగ్‌లో ఉన్న రూ,6,700 కోట్లు విడుదల చేశారు.

## ఆధార్ నంబర్ ఉందా..?

# అయితే డబ్బులు విత్‌డ్రా చాలా ఈజీ!



ప్రస్తుతం వినియోగదారులు నగదు కంటే డిజిటల్ లావాదేవీలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అయితే మనకు నగదు అవసరమయ్యే సందర్భాలు చాలా ఉన్నాయి. సాధారణంగాతక్షణమే నగదు విత్‌డ్రా చేయడానికి ఉపయోగిస్తారు. కానీ డబ్బును విత్‌డ్రా చేసుకోవడానికి చాలా సులభమైన మార్గం కూడా ఉంది. మీరు మీ ఆధార్ కార్డు ద్వారా ఈ నగదు విత్‌డ్రా చేయవచ్చు. అంటే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వినియోగదారులకు(ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్)ని అందిస్తోంది. ఈ సేవ వినియోగదారులు ఆధార్ కార్డ్ నంబర్, బయోమెట్రిక్‌తో బ్యాంకింగ్ సంబంధిత పనిని చేయడానికి అనుమతిస్తుంది. మైక్రో-ఏటిఎమ్‌లో క్యాష్ విత్‌డ్రా, బ్యాలెన్స్ విచారణ, నిధుల బదిలీ కోసం దీనిని ఉపయోగించవచ్చు. ఆధార్ కార్డ్ నుండి నగదు విత్‌డ్రా చేయడానికి మీ ఆధార్ నంబర్‌ను బ్యాంక్ ఖాతాకు లింక్ చేయడం చాలా ముఖ్యం. మీ ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతా లింక్ చేసుంటే ఈ స్టెప్స్ పాటించండి. అనుసరించండి:- 1 ఆధార్‌కి మద్దతిచ్చే బ్యాంకింగ్ ఏజెంట్ లేదా మైక్రో-ని సందర్శించండి. ఇవి సాధారణంగా గ్రామీణ ప్రాంతాలు, బ్యాంకింగ్ అవుట్‌లెట్‌లు లేదా మొబైల్ బ్యాంకింగ్ సేవలలో కనిపిస్తాయి. 2 మైక్రోమీ 12 అంకెల ఆధార్ నంబర్‌ను నమోదు చేయండి. 3 ఫింగర్ ప్రింట్ స్కానర్ సహాయంతో బయోమెట్రిక్ ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయండి. అథెంటిఫికేషన్ విజయవంతం కావాలంటే మీ డేటా తప్పనిసరిగా ఆధార్ కార్డ్‌తో సరిపోలాలి. 4 అథెంటిఫికేషన్తర్వాత, సిస్టమ్ మీకు అనేక ఎంపికలను చూపుతుంది. దీని నుండి 'నగదు విత్‌డ్రా' ఎంచుకోండి. 5 మీరు విత్‌డ్రా చేయాలనుకుంటున్న నగదు మొత్తాన్ని నమోదు చేయండి. ఇలా చేసిన తర్వాత, మీ లింక్ చేయబడిన బ్యాంక్ ఖాతా నుండి డబ్బు డెబిట్ అవుతుంది. మీరు డిపాజిట్ చేస్తున్న మొత్తం విత్‌డ్రా పరిమితిలోపు ఉండాలని గుర్తుంచుకోండి. 6 లావాదేవీ పూర్తయిన తర్వాత బ్యాంకింగ్ ఏజెంట్ మీకు నగదు ఇస్తారు. అంతేకాకుండా మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు లావాదేవీ పూర్తయిన మెసేజ్ కూడా అందుతుంది. 1 అధీకృత బ్యాంకింగ్ సేవలకు మాత్రమే మీ ఆధార్ నంబర్‌ను అందించండి. 2 లావాదేవీ హెచ్చరికల కోసం మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌ను అప్‌డేట్‌గా ఉంచండి. 3 ప్రక్రియలో ఉపయోగించిన వేలిముద్ర స్కానర్ సురక్షితంగా ఉందో లేదో చెక్ చేయండి.

# కోడి మాంసానికి భలే..భలే



ఏలూరు: కోళ్లు కత్తులు దూస్తున్నాయి. కోట్లు చేతులు మారుతున్నాయి. సంక్రాంతి పండుగ వేళ పందెం కోడి.. తొడకొట్టి బరిలోకి దిగింది. ప్రత్యర్థితో హోరా హోరీగా పోరాడింది. మినీ స్టేడియాల రీతిలో ఏర్పాట్లు.. వేల మంది వీక్షకులు.. అరుపులు, కేకలు, పందెం రాయుళ్ల జోరు.. వ్యాఖ్యాతల హోరు.. గోదారి జిల్లాలలో సందడి ఇది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పగలూ, రేయి అనే తేడా లేకుండా కోడిపందేలు భారీగా జరుగుతు న్నాయి. వేల నుంచి లక్షల వరకూ కోడి పందేలు నిర్వహిస్తున్నారు. ఇక పందేల కోసం ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేశారు. డబ్బులు చేతిలోనే ఉండాల్సిన పనిలేదు. ఇక్కడ కూడా డిజిటల్ ఇండియా వచ్చేసింది. యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తే వెంటనే నగదు ఇచ్చేలా ప్రైవేట్ బ్యాంకులు స్టాళ్లు కూడా ఏర్పాటు చేశాయంటే మీరు అర్థం చేసుకోవచ్చు. కోడి పందేలలో గెలిచి డబ్బులు గెలుచుకోవటం ఒకటైతే.. పందెం గెలిచిన కోడి యజమానికి ఇస్తున్న బహుమతులు మరొకటి. ఇలా పందెం గెలిచిన కోడి యజమానులకు ప్రత్యేక బహుమతులు అందిస్తున్నారు. కరపలో ఏకంగా మహీంద్రా థార్ కారు బహుమతిగా ప్రకటించారు. 60 కోడి పందేలలో ఎవరెక్కువ గెలిస్తే వారికి థార్ కారు బహుమతిగా ఇవ్వనున్నారు. హోండా యాక్టివాలు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకులు ఇలా అబ్బో లిస్టు పెద్దగానే ఉంది లెండి. అయితే కోడి పందేలు గెలిచినవారు, పందెం కోళ్ల యజమానుల సంగతి పక్కనబెడితే.. పందెంలో ఓడిపోయిన కోళ్లకు కూడా భారీగా డిమాండ్ ఉంది. కోడిపందేల్లో చనిపోయిన కోడిపుంజు మాంసాన్ని కోస మాంసం అని పిలుస్తుంటారు. కృష్ణా, గోదావరి జిల్లాలలో ఈ కోస మాంసానికి ఇప్పుడు భారీగా డిమాండ్ ఉంది సంక్రాంతి పండుగ మూడురోజులలో ఒక్కసారైనా ఈ కోస మాంసం రుచి చూడాలనేది ఇక్కడి ప్రజల నమ్మకం. అందుకే కోస మాంసం కోసం భారీ డిమాండ్ ఉంది. కొంతమంది దూరంగా ఉన్న తమ బంధుమిత్రులకు, రాజకీయ నేతలకు కూడా ఈ కోస మాంసం పంపిస్తున్నారంటే దీనికి ఎంత డిమాండ్ ఉందనేదీ అర్థం చేసుకోవ చ్చు. ఈ కోస మాంసాన్ని రూ. 2000 నుంచి రూ. 3000 పెట్టి మరీ కొంటున్నారు. కనుమ పండుగ రావటంతో ఈ రేటు మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలో కొంతమంది ఇంట్లో పెంచిన కోడిపుంజు లకు గాట్లు పెట్టి అమ్ముతున్నట్లు తెలిసింది. పెరటి కోడిపుంజులను తక్కువ రేటుకు కొనుగోలు చేసి.. బ్లేడ్లతో గాట్లు పెట్టి కాల్చి.. కోస మాంసంగా అమ్ముతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి

# విశాఖ ఎయిర్‌పోర్టులో నూతన సేవలు

విశాఖపట్టణం: అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా తీర్చిదిద్దుతున్న ఏపీ ప్రభుత్వం.. విశాఖపట్నం అభివృద్ధిపైనా దృష్టి సారించింది. విశాఖపట్నాన్ని ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దుతామని ఏపీసీఎం నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే చాలా సార్లు ప్రకటించారు. దేశానికి ఆర్థిక రాజధానిగా ముంబయి ఎలా మారిందో అదే తరహాలో ఏపీ ఆర్థిక రాజధానిగా విశాఖను మారుస్తామని




చంద్రబాబు ఇటీవలే మరోసారి స్పష్టం చేశారు. ఆ దిశగానే విశాఖపట్నంలో గూగుల్, లులూ వంటి అంతర్జాతీయ సంస్థలను పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ ప్రభుత్వం ఒప్పించింది. తాజాగా విశాఖపట్నం పారిశ్రామిక అభివృద్ధిలో కీలక అడుగు పడింది. విశాఖపట్నం నుంచి దుస్తులు, సముద్ర ఉత్పత్తులు, ఫార్మా ఉత్పత్తుల రవాణాకు త్వరలోనే మార్గం సుగమం కానుంది2019-20 ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి సుమారుగా 470 టన్నుల అంతర్జాతీయ కార్గో రవాణా జరిగినట్లు లెక్కలు చెప్తున్నాయి. అయితే ఆ తర్వాతి కాలంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ కార్గో సేవలు నిలిచిపోయాయి. వీటికి కూడా పలు కారణాలు ఉన్నాయి. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ నిబంధనల ఉల్లంఘన కారణంతో విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుంచి అంతర్జాతీయ కార్గో సేవలు నిలిచిపోయాయి. దీంతో ఏదైనా సరుకును ఎగుమతి చేయాలంటే ఇక్కడి పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సరుకును ఎగుమతి చేయాలంటే చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటిచోట్లకు రోడ్డు మార్గంలో తీసుకెళ్తున్నారు. అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తు?న్నారు. అయితే ఈ సమస్యలకు చెక్ పెట్టే దిశగా కీలక అడుగు పడింది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే విశాఖపట్నం విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ కార్గో సేవలు మొదలుపెట్టనున్నారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది, రెండేళ్లపాటుకార్గో నిర్వహణ చేపట్టేందుకు ముందుకొచ్చింది. సరుకు తనిఖీల దగ్గర నుంచి లోడింగ్, అన్‌లోడింగ్ వరూ అన్నింటి ఖర్చులను ఏపీటీపీసీ భరిస్తుంది. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ నుంచి అనుమతులు తీసుకుని.. మూడు వారాల్లో సేవలు ప్రారంభించను న్నారు. దీంతో పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 150 శాతం పెరిగిన విమానయానం

అలహాబాద్: ప్రయాగ్‌రాజ్ ఇప్పుడు ప్రత్యక్ష.. వన్-హాప్ విమానాల ద్వారా 20కిపైగా గమ్యస్థానాలకు కనెక్ట్ చేశారు. గత కుంభ్ సమయంలో కేవలం ఒక (ఢిల్లీ)తో పోలిస్తే, ఈ సంవత్సరం మేళాకు యాత్రికులు, ఇతర పర్యాటకులను చేర్చడంలో విమాన యానం కీలక పాత్ర పోషిస్తోందని ఈక్సిగో గ్రూప్ సీఈవో అలోకే బాజ్‌పాయ్ చెప్పారు.. ఇక్సిగోలో విమాన బుకింగ్‌లలో నగరం సంవత్సరానికి 162 శాతంపెరుగుదల నమోదు చేయడంలో ఆశ్చర్యం లేదన్నారు. వారణాసి, లక్నో వంటి సమీప విమానాశ్ర యాలు బుకింగ్‌లలో వరుసగా 127. 42 శాతం వృద్ధిని సాధించా యి. ఈ మహాకుంభ్ ప్రారంభ ? ముగింపు వారాల్లో ప్రయాణానికి డిమాండ్ ఎక్కువగా ఉంటుందని మేక్ మై ట్రిప్ సహ వ్యవస్థాపకుడు, గ్రూప్ సీఈవో రాజేష్ మాగో తెలిపారు. ప్రయాగ్‌రాజ్ కోసం శోధన లు సంవత్సరానికి 23 రెట్లు పెరిగినట్లు తెలిపారు. కోవిడ్ పూర్వ స్థాయిల కంటే తక్కువగా ఉన్న సమయంలో మహా కుంభ్ విదేశీ పర్యాటకుల రాకపోకలను పెంచుతుందని భావిస్తున్నారు. ఈ కుంభ్‌లో విదేశీ పర్యాటకుల సంఖ్య మునుపటి వాటి కంటే చాలా ఎక్కువగా ఉందని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ ప్రెసిడెంట్ రాజీవ్ మెహ్రా పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ టూరిజం శాఖ చేపట్టిన భారీ ప్రచార కార్యక్రమం సత్ఫలితానిస్తుందన్నారు. విమానా లతో పాటు రైళ్లు కూడా మహా కుంభానికి వెళ్లే పర్యాటకులతో రద్దీగా ఉన్నాయి. "ప్రయాగ్‌రాజ్ కోసం రైలు బుకింగ్‌లు సంవత్సరా నికి 187 శాతం పెరిగాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, బుకింగ్‌లలో 57 శాతం సోలో ట్రావెలర్లు, 39 శాతం మహిళలు ఉన్నారు. గ్రూప్ బుకింగ్‌లు 43 శాతం ఉన్నాయి," అని ఇక్సిగో ట్రైన్స్,సీఈవో దినేష్ కుమార్ కోథా తెలిపారు. ప్రధాన మెట్రో నగరాల నుంచి ప్రయాగ్‌రాజ్, చుట్టుపక్కల విమానాశ్రయాలకు వన్-వే విమాన ఛార్జీలు 30 రోజుల ముందుగా బుక్ చేసుకుంటే సగటున రూ. 7,000-10,000 మధ్య ఉంటుంది. అయితే, భోపాల్- ప్రయాగ్‌రాజ్ వంటి కొన్ని రూట్‌లలో అత్యధిక డిమాండ్.. పరిమిత విమాన లభ్యత కారణంగా ఛార్జీలు రూ. 17,000 వన్-వేకి పెరిగాయి. పవిత్ర స్నానం తేదీల కంటే ముందు ప్రయాణానికి ఛార్జీలు కూడా ఎక్కువగా ఉన్నాయి . ఉదాహరణకు, ఈక్సిగో ప్రకారం, ముంబై వంటి కీలకమైన మెట్రోల నుండి జనవరి 27న నాన్-స్టాప్ విమానాలకు వన్-వే రూ. 27,000. ప్లాట్‌ఫారమ్ మహా కుంభ్ కోసం మైక్రోసైట్‌ను కూడా ప్రారంభించింది.. ఇందులో ప్రయాణం, వసతి ఎంపికలు, భద్రతా చిట్కాలు, ఆచారాలు, కార్యకలాపాలు.. తదితర వివరాలు ఉన్నాయి. జైపూర్, బెంగళూరు, నాగ్‌పూర్, కొచ్చి, ముంబై వంటి నగరాల నుండి ప్రయాగ్‌రాజ్‌కి విమాన ఛార్జీలు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే దాదాపు 3 రెట్లు పెరిగాయని క్లియర్‌ట్రిప్ చీఫ్ బిజినెస్ అండ్ గ్రోత్ ఆఫీసర్ అనుజ్ రాఠీ తెలిపారు. ఢిల్లీ-ప్రయాగ్‌రాజ్, ముంబై-వారణాసి కీలకమైన ఫీడర్ రూట్‌లలో ట్రాఫిక్ పెరుగుతోందని కాక్స్ ఢ కింగ్స్ ప్రెసిడెంట్ రామలింగం ఎస్ అన్నారు. అహ్మదాబాద్, పూణే వంటి టైర్ 2 నగరాల నుండి ఉత్తరప్రదేశ్‌లోని గమ్యస్థానాలకు అనుసంధానించే విమానాలు కూడా అధిక డిమాండ్ తో ధరలు పెరిగాయి. విమాన ఛార్జీలు మహా కుంభ తేదీలలో 70 శాతం పెరిగాయి. ఈ మహా కుంభ్ లో 2,000 టెంట్‌లతో కూడిన మినీ సిటీకి బలమైన డిమాండ్ కనిపిస్తోందని, భక్తులు పవిత్ర స్థలంలో దగ్గరగా లీనమయ్యే అనుభూతిని కోరుకుంటున్నారని మాగో చెప్పారు. గుడారాల విషయానికొస్తే, లగ్జరీ నుండి డార్మిటరీ వరకు విస్తృత ఎంపిక ఉంది. ప్రైవేట్ సంస్థలు, కార్పొరేట్లచే నిర్వహించబడే గుడారాలు, ఇస్కాన్ (ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షియస్‌నెస్) వంటి మతపరమైన సంస్థలు కూడా నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముందే.. రోజుకు 1.5 నుండి 2 కోట్ల మంది సందర్శకులు వస్తారని అంచనా వేయడంతో, అనేక రకాల వసతి ఎంపికలను అందుబాటులోకి తెచ్చినట్లు పిట్టీ తెలిపారు. ఒక టెంట్‌కి రాత్రికి 12,500 నుంచి 50,000 రూపాయల వరకు ఖర్చవుతుందని కులకర్ణి సూచించారు. అల్టిమేట్ ట్రావెలింగ్ క్యాంప్ విలాసవంతమైన గుడారాల వంటి ప్రీమియం డిగ్‌లు, ఒక రాత్రికి రూ. 1లక్ష ధరతో, రాచరికపు స్నానపు రోజులతో సహా కీలక తేదీల కోసం ఇప్పటికే పూర్తిగా బుక్ అయ్యాయి.. ఐఆర్‌సీటీసీ మహాకుంభ్ గ్రామ్, యూపిఎస్టీడీసీ టెంట్ కాలనీ వంటి ఇతర ఎంపికలు బేసిక్ నుండి డీలక్స్ వరకు వివిధ రకాల గదులను అందిస్తున్నాయి.. వీటి ధరలు రాత్రికి రూ. 1,500 నుండి రూ. 35,000 వరకు ఉంటాయని పిట్టీ చెప్పారు. ఈ ప్రాంతంలోని లగ్జరీ హోటళ్లు రాత్రికి రూ. 11,000 నుండి రూ. 30,000 వరకు వసూలు చేస్తున్నాయి.. కొన్ని ప్రీమియం సంస్థలు రూ. 40,000 వరకు ఉన్నాయి. ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ప్రయాగ్‌రాజ్ హోటల్ బుకింగ్‌లలో 10 రెట్లు పెరిగింది.. ఇక జనవరి ? ఫిబ్రవరిలో జరిగే మహా కుంభ తేదీల సమయంలో హోటళ్లు ఇప్పటికే 85 శాతానికి పైగా బుక్ అయ్యాయి.. జనవరి 13న ప్రారంభమైన మహా కుంభం ఫిబ్రవరి 26 వరకు కొనసాగుతుంది. ప్రీమియం ? మిడ్-రేంజ్ హోటళ్లు నెలల ముందే పూర్తిగా బుక్ అయ్యాయి. మిగిలిన వసతి గృహాలు కుంభం కాని నెలలతో పోలిస్తే 50-60 శాతం ధరలను పెంచుతున్నాయి. సమీప నగరాలు, వారణాసి, లక్నోలకు డిమాండ్ పెరుగుతోంది. అక్కడ, హోటళ్ల బుకింగ్‌లు 40-50 శాతం పెరిగాయి.. 45 రోజుల్లో సుమారు 40 కోట్ల మంది భక్తులు ప్రయాగ్రాజ్కు వస్తారని ప్రభుత్వ అంచనా వేసింది.. ఈ నేపథ్యంలో పర్యాటక రంగం వృద్ధి మరింత పెరగనుంది.



# ఈ ఆహారాలను తీసుకుంటే

# మీ శరీరంలో క్రిములు అసలు ఉండవు..!

మన శరీర రోగ నిరోధక వ్యవస్థ నిరంతరాయంగా పనిచేస్తూనే ఉంటుంది. శరీరంలోకి చేరే క్రిములను ఎప్పటికప్పుడు నాశనం చేస్తుంది. అయితే రోగ నిరోధక వ్యవస్థ పనితీరు సరిగ్గా లేనివారు, ఇమ్యూనిటీ తక్కువా ఉన్నవారు తరచూ రోగాల బారిన పడుతుంటా రు. ఎందుకంటే క్రిములు శరీరంలోకి ప్రవేశించిన తరువాత రోగ నిరోధక శక్తి కణాలు సరిగ్గా పనిచేయవు. లేదా కణాలు తగిన సంఖ్యలో ఉండవు. దీంతో శరీరం ఇన్ఫెక్షన్ లేదా రోగానికి వ్యతిరేకం గా పోరాడలేకపోతుంది. దీని వల్ల వ్యాధి తీవ్రత ఎక్కువవుతుంది. అయితే రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటే ఎలాంటి రోగాలు రావు. క్రిములు మన శరీరంలోకి చేరగానే వెంటనే రోగ నిరోధక వ్యవస్థ చంపేస్తుంది. కనుక క్రిములను చంపేందుకు గాను ఇమ్యూనిటీని పెంచే ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది.

**నిమ్మకాయ..:** నిమ్మకాయలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. నిమ్మకాయలో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి.

అందువల్ల ఉదయం నిమ్మకాయ నీళ్లను తాగితే శరీరంలోని వ్యర్థాలు బయటకు పోతాయి. జీర్ణక్రియ మెరుగు పడుతుంది.

నిమ్మరసం తాగడం వల్ల మన శరీరంలోకి క్రిములు చేరగానే వెంటనే రోగ నిరోధక వ్యవస్థ యాక్టివేట్ అయి క్రిములను చంపేస్తుంది. దీంతో రోగాలు రాకుండా ఉంటాయి. అందువల్ల రోజూ నిమ్మరసం తాగాలి. లవంగాల్లో యూజినాల్ అనే సమ్మేళణం ఉంటుంది. ఇది యాంటీ మైక్రోబియల్ గుణాలను కలిగి ఉంటుంది.


**లవంగాలు..:** లవంగాలను మనం తరచూ మసాలా వంటల్లో వేస్తుంటాం. ఇవి ఇన్ఫెక్షన్లు రాకుండా రక్షిస్తాయి.

ముఖ్యంగా లవంగాలను తీసుకోవడం వల్ల గొంతు నొప్పి, వాపులు, మంట ఉండవు. బాక్టీరియా, వైరస్‌లకు వ్యతిరేకంగా పోరాడడంలో లవంగాలు అద్భుతంగా పనిచేస్తాయి. అందువల్ల రోజూ లవంగాలను కూడా తింటుండాలి. పసుపులో కర్క్యుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటుంది. దీన్ని మనం రోజూ వంటల్లో వేస్తూనే ఉంటాం. పసుపును పాలలో కలిపి తాగితే బాక్టీరియా, వైరస్ ల నుంచి రక్షణ లభిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరంలోని వాపులు తగ్గిపోతాయి.

**వెల్లుల్లి..:** వెల్లుల్లిలో ఆల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది సహజసిద్ధమైన యాంటీ బయోటిక్‌లా పనిచేస్తుంది. బ్యాక్లీరియా, వైరస్‌లను ఇది నాశనం చేస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో దగ్గు, జలుబు, ఇన్ఫెక్షన్లు రావు. అల్లంలో యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల అల్లం రసాన్ని తాగితే శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. గొంతు నొప్పి, మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. మీరు రోజూ తీసుకునే ఆహారంలో అల్లంను ఎలా అయినా తీసుకోవచ్చు. దీని వల్ల జలుబు నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. అల్లంను తీసుకుంటే జీర్ణక్రియ మెరుగు పడుతుంది. అలాగే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. రోగాల బారి నుంచి రక్షణ లభిస్తుంది.

**తులసి..:** ఆయుర్వేదంలో తులసికి ఎంతో ప్రాధాన్యతను కల్పించారు. ఇందులో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల తులసి ఆకులతో తయారు చేసిన టీని తాగాలి. దీంతో ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. జ్వరం తగ్గుతుంది. రోగ నిరోధక శక్తి పరుగుతుంది. దగ్గు,జలుబును తగ్గించడంలో తులసి ఆకులు అద్భుతంగా పనిచేస్తాయి. తేనెలో సహజసిద్ధమైన యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి.

అందువల్ల ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. తేనెను ఎంతో పురాతన కాలం నుంచే ఔషధంగా ఉపయోగిస్తున్నారు. తేనెను తీసుకోవడం వల్ల గొంతు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. గాయాలపై తేనెను రాస్తే అవి త్వరగా మానుతాయి. ఇలా పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుకోవచ్చు. దీంతో సీజనల్ వ్యాధులు, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది.



## ఛార్మింగ్ లుక్‌లో ప్రభాస్


అగ్ర హీరో ప్రభాస్ ఈ ఏడాది వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'ది రాజా సాబ్' చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. వేసవిలో ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా మంగళవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ప్రభాస్ ఛార్మింగ్ లుక్‌లో కనిపిస్తున్నారు. ప్రభాస్ ఇప్పటివరకు చేయని హారర్ కామెడీ జోనర్ కావడంతో ఈ సినిమాపై అందరిలో ఆసక్తి నెలకొంది. 'ఈ సినిమాలో ప్రభాస్ సరికొత్త రొమాంటిక్ అవతారంలో కనిపిస్తారు. వినోదంతో పాటు కావాల్సినంత యాక్షన్ హంగులుంటాయి. అభిమానులకు ఓ పండగలా దర్శకుడు మారుతి ఈ సినిమాను తీర్చిది ద్దుతున్నారు' అని చిత్ర బృందం పేర్కొంది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవన్, రచన-దర్శకత్వం: మారుతి.

## తరచూ వాల్‌నట్స్ తింటే ఆ క్యాన్సర్‌లు మీ దరిదాపుల్లోకే రావు..

బాగా ఖరీదైన వాల్ నట్స్‌ను ఒకప్పుడు బాగా డబ్బులు ఉన్నవారు మాత్రమే తినేవారు. అందుకే ఖరీదైన పంట కావడం, డిమాండ్ తక్కువగా ఉండటం కారణంగా చాలా తక్కువగా వాల్ నట్స్‌ను సాగుచేసే వారు. అయితే వాల్ నట్స్‌తో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తెలిసిన తర్వాత వీటికి డిమాండ్ పెరిగింది. మధ్యతరగతి ప్రజలు కూడా వాల్‌నట్స్‌ను తమ ఆహారంలో బాగం చేసుకుంటున్నారు. దాంతో విదేశాల్లో ఉత్పత్తి అయ్యే టాప్-10 వ్యవసాయ ఉత్పత్తుల్లో వాల్‌నట్స్ కూడా చేరాయి. మరి వాల్‌నట్స్‌తో ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం..

**గుండెకు:** వాల్‌నట్స్‌లో ఆల్ఫా-లినోలెనిక్ యాసిడ్, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇవి శరీరంలో వాపును తగ్గించడం లో కీలకంగా పనిచేస్తాయి. నిజానికి ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా ఉండే గింజల్లో వాల్‌నట్స్ కూడా ఒకటి. వీటిలో ఉండే ప్రత్యేక గుణాలు గుండెజబ్బుల నుంచి రక్షణనిస్తాయి.

**మెదడుకు:** వాల్‌నట్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు యాంటీ ఇన్ఫ్లమేటరీ సమ్మేళనాలు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయని వృద్ధాప్యంతో వచ్చే మానసిక క్షీణతను నెమ్మదించేలా చేస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇవి మీ జ్ఞాపకశక్తిని పెంచడంలో కూడా కీలకపాత్ర పోషిస్తాయి.



**గట్ ఆరోగ్యం:** మీపేగులు, పేగులలోని బ్యాక్టీరియా సూక్ష్మజీవులు కూడా మీరు ఆరోగ్యంగా ఉండేందుకు ఎంతో అవసరం. వాల్‌నట్‌లు పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి. క్లినికల్ ట్రయల్స్‌లోనూ ఇదే విషయం వెల్లడైంది. ప్రతిరోజూ వాల్‌నట్స్‌ను తినేవారు ఆరోగ్యకరమైన గట్ బ్యాక్టీరియా ను కలిగి ఉన్నారని అధ్యయనాలు తెలుపుతున్నాయి.

**క్యాన్సర్ నివారణ:** మీ గట్‌లోని సూక్ష్మజీవులు వాల్‌నట్‌లలో ఉండే సమ్మేళనాలను తీసుకుంటాయి. తర్వాత యురోలిథిన్ సమ్మేళ నాలను ఉత్పత్తి చేస్తాయి. ఈయురోలిథిన్ సమ్మేళనాలు కొన్ని క్యాన్సర్‌ల ప్రమాదాన్ని తగ్గించడంలో సాయపడతాయి.

## నారీ నారీ నడుమ మురారి



హీరో శర్వానంద్ నటిస్తున్న తాజా చిత్రానికి 'నారీనారీ నడుమ మురారి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. శర్వానంద్ నటిస్తున్న 37వ చిత్రమిది. సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ను అగ్ర నటులు బాలకృష్ణ, రామ్‌చరణ్ విడుదల చేశారు. 'ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. ఆద్యంతం వినోదాత్మకంగా సాగు తుంది. శర్వానంద్ పాత్ర గత చిత్రాలకు భిన్నంగా ఉంటుంది. అత్యున్న తసాంకేతిక ప్రమాణాలతోతెరకెక్కించబోతున్నాం' అని మేకర్స్ తెలిపారు. సాక్షి వైద్య, సంయుక్త కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జ్ఞానశేఖర్, కథ: భానుభోగవరపు,సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాణ సంస్థలు: ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రామ్ అబ్బరాజు.

## తమిళ, కన్నడలో అవకాశాలు...



'బేబీ' చిత్రం కథానాయిక వైష్ణవి చైతన్య కెరీర్‌ను మలుపుతిప్పింది. ఈ సినిమాలో ఆమె అభినయానికి మంచి ప్రశంసలు దక్కాయి. ఉత్తమ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు వరించింది. ప్రస్తుతం సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉంటూ కథాబలమున్న చిత్రాలనే అంగీకరిస్తున్నది వైష్ణవి చైతన్య. ప్రస్తుతం ఈ భామ తెలుగులో సిద్ధు జొన్నలగడ్డ సరసన 'జాక్' చిత్రంలో నటిస్తున్నది. మరికొన్ని పెద్ద చిత్రాలు చర్చల దశలో ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సొగసరికి తమిళం, కన్నడ ఇండస్ట్రీల నుంచి కూడా భారీ ఆఫర్లొస్తున్నట్లు తెలిసింది. అక్కడ రెండు చిత్రాలకు ఆమె సైన్ చేశారని సమాచారం. ఈ ఏడాది తెలుగుతో పాటు తమిళ, కన్నడ భాషల్లో కూడా మంచి విజయాలను సొంతం చేసుకుంటానని ధీమా వ్యక్తం చేస్తున్నది వైష్ణవి చైతన్య. సోషల్‌మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో తన సినిమాలకు సంబంధించిన విశేషాలను పంచుకుంటుంది వైష్ణవి చైతన్య. తాజాగా ఈ భామ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫొటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ కొత్త ఏడాది నటిగా తనను మరో మెట్టెక్కిస్తుందనే నమ్మకంతో ఉంది వైష్ణవి చైతన్య.

## అవమానాలే పెట్టుబడిగా..



కలలు కనడం చాలా సులభం. వాటిని నెరవేర్చుకోవడమే కష్టం. కానీ ఎంతోమంది తమ కలలని సాకారం చేసుకుంటారు. ప్రగతిబాటలో నడుస్తారు. అలాంటి వారిలో ఒకరే కేరళకి చెందిన మహ్మద్ యాసిన్. 29 ఏళ్ల ఈ యువకుడు ఇటీవల కేరళ జ్యుడిషియల్ సర్వీస్ ఎగ్జామ్‌లో రెండో ర్యాంకు సాధించాడు. మెజిస్ట్రేట్‌గా నియమితుడయ్యారు. ఈ లక్ష్యం సాధించడం వెనుక ఆయన ఎన్నో అవరోధాలు అధిగమించారు. అవమానాలు భరించారు. అతని గురించి చెప్పుకోవాలంటే 'విలయూర్ పేపర్ బాయ్'గా అతని జీవితం మొదలైన దగ్గర నుండి తెలుసుకోవాలి. యాసిన్ తండ్రి యాసిన్‌కి మూడేళ్లప్పుడు కుటుంబం నుండి దూరంగా వెళ్లిపోయాడు. తమ్ముడిని, తనని ఆశా వర్కర్ అయిన తల్లే పెంచి, పోషించింది. ఒంటరి తల్లి పెంపకంలో సమాజం అతన్ని చిన్నచూపు చూసింది. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాడు. తల్లి కష్టం చూడలేని యాసిన్ కుటుంబం కోసం ఏడేళ్ల నుండే పనులకు వెళ్లేవాడు. సౌకర్యాలు పొందడం, లగ్జరీగా ఉండడం చిన్నారి యాసిన్‌కి అస్సలు తెలియదు. పేపర్ బారుగా, పాలబ్బాయిగా, నిర్మాణరంగ కూలీగా, పెయింటర్‌గా, ఫుడ్ డెలివరీ బారుగా ఏ పని ఉంటే ఆపనికి వెళ్లడం అతని దినచర్యగా ఉండేది.'అమ్మ మమ్మల్ని చాలా కష్టాలు పడి పెంచింది. కానీ అందరూ మమ్మల్ని చులకనగా చూసేవారు. సరిగ్గా పెరగడం లేదని అవమానించేవారు. మా ప్రతి కదలికను ఎగతాళి చేసేవారు. అవమానాలే నా పెట్టుబడి. పేదరికం కారణంగా స్కూల్లో కూడా అవమానాలు ఎదుర్కొన్నాను. సరిగ్గా చదవడం లేదని చాలాసార్లు తరగతి గది నుండి బయటికి పంపేశారు. నా వ్యక్తిగత పరిస్థితులు నా చుట్టూ ఎన్నో విషమపరిస్థితులను తీసుకొచ్చాయి' అంటారు యాసిన్. ప్రతి కూలతలనే సానుకూలతలుగా మలచుకుని యాసిన్ విద్యాభ్యాసం పూర్తిచేశారు. 2019లో ఎర్నాకులం లా కాలేజీలో డిగ్రీలో చేరారు. ఇక్కడ కూడా యాసిన్‌ని అతని పేదరికం వెంటాడింది. కాలేజీ ఫీజుల కోసం ఫుడ్ డెలివరీ బారుగా మారారు. పగలు కాలేజీకి వెళ్లడం, రాత్రుళ్లు కొచీలో డెలిరీ బారుగా విధులు నిర్వహించే వారు. మొదట్లో సాధారణ విద్యార్థిగా ఉన్న యాసిన్ నెమ్మదిగా చదువుపై దృష్టిపెట్టారు. లా మొదటి సంవత్సరం కంటే రెండో ఏడాది నుండి మెరుగైన ప్రతిభతో రాణించారు. యూనివర్శిటీ టాపర్లలో ఒకరిగా నిలిచారు. ఎల్ఎల్‌బి పూర్తిచేసిన తరువాత 2023 నుండి లాయర్‌గా అద్భుత ప్రదర్శన కనబరిచారు. 'అవుట్ స్టాండింగ్ లాయర్' అవార్డు అందుకునేంతగా ఆయన పనితీరు ఉండేది.

'నా ఉన్నత చదువంతా సెకండ్ హ్యాండ్ బుక్స్‌తోనే సాగింది. ఇతరులు వాడేసిన బట్టలనే కట్టుకునేవాడిని. మసీదు వాళ్లు దానం చేసిన బియ్యం, పప్పులతోనే మా రోజు గడిచేది. ఇలాంటి పరిస్థితుల్లో నాకు సాయంగా నిలబడిన ప్రతి ఒక్కరికీ నేను రుణపడి ఉంటాను. నాసీనియర్ అడ్వకేట్ సాహుల్ హమీద్ ఇచ్చిన ప్రోత్సాహం ఎప్పటికీ మర్చిపోను. ఆయన తన ఆఫీసులో నాకుచోటిచ్చారు. ఆ వెసులుబాటు నాకుఎన్నో మెట్లు పైకి ఎదగడానికి సాయం చేసింది' అని తన ప్రయాణంలో చేయూతనిచ్చిన ప్రతిఒక్కరినీ యాసిన్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. లాయర్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టిన రెండో ఏడాదే మెజిస్ట్రేట్‌గా నియమితులవ్వడం సాధారణ విషయం కాదు. ఎంతో కఠోరదీక్ష కావాలి. ఈ కల చాలామందికి ఉంటుంది. కానీ యాసిన్ లాంటి వారు మాత్రమే దాన్ని చేరుకుంటారు. అయితే ఈ విజయం పట్ల యాసిన్ ఏమనుకుంటున్నారో ఆయన మాటల్లోనే తెలుసుకుందాం. 'ఇక్కడితో నా గమ్యం పూర్తవ్వలేదు. జీవితం ఎన్నో సవాళ్లని మన ముందుంచుతుంది. అయితే నేను బలంగా ఒక్కటి నమ్ముతాను. నిన్నటి కంటే ఈరోజు చాలా బాగుంటుంది' అంటున్న యాసిన్ 'అణగారిన వర్గాల కోసం పనిచేస్తాన'ని ప్రతిజ్ఞ చేశారు. 'ఎన్నో సవాళ్ల మధ్య జీవించిన నేను వారి బాగు కోసం నిరంతరం కష్టపడతాను' అంటున్నారు.

Published & Owned by Mamidi Somaiah, H.No.3- 2-92/27 to 276/506, Rock Town Colony, LB Nagar, Hyd, Rangareddy, Telangana- 500068. Printed at Ellora Printers, LN Nagar, Industrial Estate, Uppal, Rangareddy, Telangana. Editor- Mamidi Somaiah. Ph No. 9 00933723. RNI No. TEL TEL . 2012/48343